

ఉర్జావీర్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి మనోహర్‌లాల్


సభికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు


# ఉత్సాహంగా ఉర్జావీర్

**భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన నాయకులు**

- ఇంధన వనరుల పొదుపుపై ఆసక్తికర ప్రసంగం
- చంద్రబాబు ప్రసంగానికి హర్షధ్వానాలు
- అంగన్వాడీలకు ఇండెక్షన్ కుక్ సెట్ల పంపిణీ

ఇంధన వనరుల పొదుపు, సమర్థవంతంగా వినియోగించే విధానాలపై పోరంకిలోని మురళీ కన్వెన్షన్‌లో శనివారం జరిగిన ఉర్జావీర్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వచ్చే ఐదేళ్లలో ఇంధన రంగంలో ప్రగతిని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించగా, విద్యుత్ ఆదాపై కేంద్రమంత్రి మనోహర్‌లాల్, రాష్ట్రమంత్రి గొట్టిపాటి రవికుమార్ చేసిన ప్రసంగం సభికులను ఆకట్టుకుంది.

**పెనమలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :** పోరంకిలోని మురళీ కన్వెన్షన్‌లో జరిగిన ఉర్జావీర్ కార్యక్రమానికి టీడీపీ కూటమి శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చాయి. స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఇచ్చిన పిలుపు మేరకు నాయకులు సైతం భారీగా తరలివచ్చారు. ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకృతిలో ఇంధన వనరులను పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించే విధానాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి మనోహర్‌లాల్ మాట్లాడి అవగాహన కల్పించారు. విద్యుత్ ఉత్పత్తితో పాటు ఆదా చేయడం కూడా ముఖ్యమని వక్తలు సూచించారు. ఇంధన పొదుపుతో జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. గ్రీన్ ఎనర్జీని, సౌర, పవన విద్యుత్‌ను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ఇంధన రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.5 లక్షల ఉద్యోగాలు వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నపుడు సభలో హర్షధ్వానాలు మిన్నంటాయి. అవసరమైతే భవిష్యత్తులో ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామనడంతో అంతటా ఆనందం వ్యక్తమైంది. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలకు విద్యుత్‌ను ఆదాచేసే ఇండక్షన్ కుక్ సెట్లను అందజేశారు. ఉర్జావీర్ కిట్లను ఆవిష్కరించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొలుసు పార్థసారథి, పొంగూరు నారాయణ, కొల్లు రవీంద్ర, ప్రభుత్వ చీఫ్‌విప్ అనూరాధ, విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణప్రసాద్, ఇంధన శాఖ కార్యదర్శి విజయానంద్, కలెక్టర్ బాలాజీతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, జనసేన నియోజకవర్గ బాధ్యులు ముప్పా రాజా, నాయకులు కోయ ఆనంద్ ప్రసాద్, సూదిమళ్ల రవీంద్ర, సీహెచ్ శ్రీనివాస్, మునునూరు శ్రీనివాసరావు, కలపాల శ్రీధర్ కార్యకర్తలను తరలించారు.





# చరిత్ర చెప్పే.. చల్లపల్లి కోట

**448 ఏళ్ల నాటి రాచరిక పాలనకు గుర్తు**

- దేవరకోట సంస్థానానికి రాజధానిగా అంతులేని ఖ్యాతి
- చల్లపల్లి రాజావారి పరిపాలనకు నిలువెత్తు సాక్ష్యం
- నేటికీ పర్యాటకులను ఆకర్షిస్తున్న రాజసౌధం

సండే స్పెషల్

8లో

ఎత్తయిన ద్వారం.. అంతెత్తున కోట బురుజులు.. మోతమోగించే కంచుగంట.. విశాలమైన కోట ప్రాంగణం.. సుందరమైన శిల్ప సంపద.. ఆకట్టుకునే అశోక వృక్షాలు.. చల్లపల్లి రాజావారి కోట ప్రత్యేకతలు. నాలుగున్నర శతాబ్దాల చరిత్రకు సజీవ సాక్ష్యంగా, రాచరికానికి చిహ్నంగా, శ్రీమంతు రాజా యార్లగడ్డ శివ రామప్రసాద్ బహదూర్ పాలనకు నిదర్శనంగా, జగజ్జనని అమ్మవారి శక్తికి నిర్వచనంగా.. నేటికీ చెక్కు చెదరకుండా నిలిచింది. పర్యాటక కేంద్రంగా, ప్రముఖ సందర్శనీయ ప్రాంతంగా నీరాజనాలు అందుకుంటోంది.

# బియ్యం కోసం కయ్యం

**ఉమ్మడి జిల్లా రేషన్ మాఫియాలో గ్యాంగ్‌వార్**

పరస్పర దాడులు.. తీవ్ర గాయాలు

- కానూరులో పాత సిండికేట్‌పై కొత్త సిండికేట్ దాడి
- ఎండీయూ ఆపరేటర్లకు తీవ్ర గాయాలు
- సిండకేట్ల మధ్య రాజీకి ప్రయత్నాలు
- రంగంలోకి దిగిన భాయ్.. ప్రతి దాడికి పన్నాగాలు

**రెండు జిల్లాల్లో ఇటీవల పెరుగుతున్న రేషన్ రచ్చ**

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** కానూరులో రేషన్ మాఫియా సిండికేట్ల మధ్య బియ్యం కొనుగోళ్ల విషయం వివాదానికి దారితీసింది. పాత సిండికేట్‌పై కొత్త సిండికేట్ దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. పెనమలూరు, ఉయ్యూరు, కంకిపాడు మండలాల్లో రెండు ప్రధాన రేషన్ మాఫియా సిండికేట్లు అక్రమంగా ఎండీయూలు, డీలర్ల నుంచి బియ్యం కొంటున్నాయి. కొద్దినెలలుగా ఈ మాఫియాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. రాజకీయ అండ కలిగిన ఓ సిండికేట్.. కొద్దిరోజులుగా మూడు మండలాల్లో తమదే మార్కెట్ అని, తమకే బియ్యం అమ్మాలని ఎండీయూలకు, డీలర్లకు షరతు విధించింది. దీనిప్రకారమే ఎండీయూ ఆపరేటర్లు సదరు సిండికేట్‌కే బియ్యం విక్రయిస్తున్నారు. కానీ, ఇంకొందరు పాత సిండికేట్‌కే విక్రయాలు జరుపుతున్నారు. తమ ఆదేశాలను బేఖాతరు చేసి వేరే మాఫియాకు విక్రయించిన ఇద్దరు ఎండీయూ ఆపరేటర్లపై కొత్త సిండికేట్‌కు చెందిన కొందరు దాడి చేశారు. ఈ దాడిలో యనమలకుదురుకు చెందిన ఒక ఎండీయూ ఆపరేటర్ తల పగిలింది. అంతేకాదు.. మళ్లీ బియ్యం అమ్మితే చంపేస్తామని హెచ్చరికలు కూడా జారీ చేశారు. పాత సిండికేట్ బాస్ అనుచరుడి (దోస్త్ డ్రైవర్)పై కూడా దాడికి పాల్పడ్డారు. ఈ వ్యవహారం పెనమలూరు పోలీసుల వద్దకు చేరింది. కేసులు పెట్టుకునే పరిస్థితి రాకుండా సిండికేట్ల మధ్య రాజీ కుదిర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొంతమంది రేషన్ డీలర్లతో కూడా పోలీసులు మాట్లాడుతూ కేసుల జోలికి వెళ్లకుండా ఉండాలని చెబుతున్నట్టు తెలుస్తోంది.

**పెరుగుతున్న వివాదం**

పెనమలూరు, ఉయ్యూరు, కంకిపాడు మండలాల్లో పాత సిండికేట్‌కు నాయకత్వం వహిస్తున్న బాస్.. బెజవాడ 'భాయ్'కు పార్టనర్. తమ అనుచరులపై జరిగిన దాడిని పాత సిండికేట్ బాస్.. సదరు భాయ్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. చెలరేగిపోయిన భాయ్ కొత్త సిండికేట్ సంగతి చూస్తానని హెచ్చరికలు కూడా జారీ చేసినట్టు సమాచారం.

**రూ.కోట్ల మాయలో కొట్లాటలు**

పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ దేశ సరిహద్దులు దాటిస్తున్న రేషన్ మాఫియాలో పరస్పర గొడవలు మొదలయ్యాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇలాంటి ఉదంతాలు ఇటీవల పెరిగాయి. ఎన్టీఆర్ జిల్లా జయంతి, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, గంపలగూడెంలో జరిగిన ఘటనలే ఇందుకు నిదర్శనాలు. అక్రమ బియ్యం వ్యాపారం రూ.కోట్లకు అధిపతిని చేస్తుండటంతో కాసుల వేటలో దాడులకు, ప్రతి దాడులకు పాల్పడుతున్నారు. కార్లతో ఢీ కొట్టించడానికి, కత్తులతో దాడులు చేయటానికి, తలలు పగలకొట్టుకోవటానికి కూడా వెనుకాడట్లేదు. ఇంత జరుగుతున్నా సిండికేట్ మాఫియాను జిల్లా అధికారులు అణచివేయలేకపోతున్నారు. ఇప్పటికైనా ఈ మాఫియాకు చెక్ పెట్టకపోతే భవిష్యత్తులో ఈ గొడవలు పెచ్చుమీరి ప్రాణాలు తీసుకునే పరిస్థితి ఏర్పడుతుంది.

# ధాన్యం.. దైన్యం

తుఫాను గండం వీడినా రైతులను ధాన్యం కొనుగోలు గందరగోళం మాత్రం వీడట్లేదు. 1262, 1318 రకం ధాన్యాన్ని కొనకుండా మిల్లర్లు, వ్యాపారులు జాప్యం సృష్టిస్తుండటం, మిల్లుల వద్ద రోజుల తరబడి నిలిపివేస్తుండటం, సరిపడా సంచులను అధికారులు సమకూర్చకపోవడం, మద్దతు ధరలో కోత, తేమశాతంలో తిరకాసు, మధ్యవర్తుల ప్రమేయం.. వెరసి ధాన్యం కొనుగోలులో రైతుకు దైన్య పరిస్థితులు ఏర్పడుతున్నాయి.


పామర్రు వద్ద జాతీయ రహదారిపై ఆరబెట్టిన ధాన్యం

## కొనుగోలులో ఇంకా తొలగని గందరగోళం

- మిల్లుల వద్ద రోజుల తరబడి రైతుల పడిగాపులు
- సంచులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్న అధికారులు
- ధరలో కోత విధిస్తున్న మిల్లర్లు, వ్యాపారులు
- తేమశాతం సాకుగా చూపి అవకతవకలు
- మినీమిల్లింగ్ మిషన్‌లో నూకలు చూపుతూ కొత్త మెలిక
- 20 టన్నులకు గానూ 17 నుంచి 18 టన్నులే లెక్క
- మధ్యవర్తుల జోక్యమొద్దని అధికారుల హెచ్చరికలు

**ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం :** ధాన్యం కొనుగోలులో గందరగోళం ఇంకా తొలగలేదు. ఈ ఏడాది అత్యధిక విస్తీర్ణంలో సాగు చేసిన 1262, 1318 రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా మిల్లర్లు, వ్యాపారులు జాప్యం చేస్తూనే ఉన్నారు. వాతావరణం కొంతమేర అనుకూలంగా మారడంతో ఇప్పటికే కోతకోసి రహదారులపై ఉంచిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకుంటున్నారు. రెండు, మూడు రోజుల క్రితం వరకు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఆఫ్‌లైన్ పద్ధతిలో ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. దీనిని ఆన్‌లైన్ చేయాలని రైతులు కోరుతున్నారు. అయితే, ధాన్యం లారీలు, ట్రాక్టర్లు మిల్లుల వద్ద రోజుల తరబడి నిలిచిపోతున్నాయి. కానీ, ఆన్‌లైన్ చేసిన ధాన్యం బిల్లులు 48 గంటల వ్యవధిలోని రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. అయితే, కొనుగోళ్ల గాడిన పడే వరకు కోతలు ఆలస్యంగా కోయాలని అధికారులు కోరుతున్నారు. రైతులకు సంచులు ఇవ్వట్లేదు.

**కూలీల ద్వారా కోతలు**

వాతావరణం కొంత అనుకూలంగా మారడంతో రైతులు కూలీల ద్వారా వరికోతలు కోయిస్తున్నారు. తేమశాతాన్ని బట్టి మద్దతు ధరను నిర్ణయిస్తామని అధికారులు చెబుతుండటంతో మిగతా 8లో..

**కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్**

వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులు ధాన్యం విక్రయించేందుకు ప్రయత్నిస్తే మధ్యవర్తులు మద్దతు ధరలో కోతపెట్టి తమ ఇష్టానుసారం ధర నిర్ణయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదేశాలతో మధ్యవర్తుల ద్వారా ధాన్యం కొనుగోలుపై అధికారులు నిఘా ఉంచారు. మధ్యవర్తులను పోలీస్‌స్టేషన్‌కు పిలిచి రైతులను ఇబ్బందులు పెట్టొద్దని చెబుతున్నారు. పెద్దమొత్తంలో వ్యాపారం చేసేవారు తమకున్న పలుకుబడితో పోలీస్‌స్టేషన్లకు వెళ్లకుండా తెరవెనుక చక్రం తిప్పుతున్నారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు, రైతులకు సంచులు, ధాన్యం రవాణాకు వాహనాలు సమకూర్చేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నారు.

# • దివి పల్లెల్లో రోడ్ల పండుగ

**అవనిగడ్డ నియోజకవర్గంలో రూ. 30.68 కోట్లతో 496 సీసీ రోడ్ల నిర్మాణం**


నాడు


నేడు

నాడు.. వైసీపీ పాలనలో రాజశేఖరపురం రోడ్డు దుస్థితి

నేడు.. టీడీపీ కూటమి పాలనలో సీసీ రోడ్డుగా మారి..

6లో

బురదతో నిండిపోయి.. అడుగేస్తే మోకాలు లోతు దిగబడిపోయి.. ఎటువైపు వెళ్లాలో తెలియక బిక్కుబిక్కుమంటూ రోడ్డెక్కే రోజులు పోయాయి. గ్రామీణ రోడ్లంటే రొచ్చురొచ్చు.. అనే మాటలు సైతం చెల్లిపోయాయి. పల్లె రోడ్లు ఇప్పుడు అభివృద్ధి పథంలో అడుగులు వేస్తున్నాయి. ఇందుకు సాక్ష్యమే పై చిత్రాలు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసం నడవడానికి కూడా ఆస్కారం లేని అవనిగడ్డ శివారు రాజశేఖరపురంలోని ఈ రోడ్డు.. టీడీపీ కూటమి ప్రభుత్వ రాకతో మొత్తం రూపు మార్చేసుకుని సీసీ రోడ్డుగా సిద్ధమైంది. ఒక్క అవనిగడ్డ నియోజకవర్గంలోనే రూ.30.68 కోట్లతో 48.730 కిలోమీటర్ల పొడవునా 496 సీసీ రహదారులు నిర్మిస్తుండటంతో ఇక్కడి పల్లెల్లో పండుగ వాతావరణం కనిపిస్తోంది.

# మద్యం షాపులకు ఝలక్

**ఎన్టీఆర్‌లో 2, కృష్ణాలో 3 షాపులపై చర్యలు**

- రూ. 5 లక్షల జరిమానాకు ప్రతిపాదనలు
- షాపుల నుంచి సరుకు బయటకు వెళ్లినందుకే..

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** మద్యం షాపులు దక్కే వరకు సిండికేట్లుగా ఉన్నారు. షాపులు దక్కాక ఆదాయం కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. నిబంధనల ప్రకారం షాపుల్లో విక్రయించాల్సిన మద్యాన్ని బ్యాక్‌డోర్ నుంచి బయటకు పంపుతున్నారు. ఇలా వ్యవహరించిన ఐదు షాపుల యజమానులపై చర్యలు తీసుకునేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

**బయటి వ్యక్తుల చేతుల్లోకి సరుకు**

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మద్యం షాపుల కేటాయింపు పూర్తయ్యాక ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు మొదలుపెట్టారు. ఇందులో ఐదు మద్యం షాపులపై కేసులు నమోదు చేశారు. వీటిలో ఎన్టీఆర్ జిల్లాలో 2, కృష్ణాజిల్లాలో 3 షాపులు ఉన్నాయి. వీటి నుంచి మద్యం సరుకు వెనుక ద్వారం నుంచి రహస్యంగా బయటకు వెళ్తున్నట్టు గుర్తించారు. దీన్ని రహస్య ప్రదేశాల్లో విక్రయిస్తుండగా, సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఆ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని వాటిపై ఉన్న హోలోగ్రామ్‌లను పరిశీలించగా, అసలు విషయం బయటపడింది. విజయవాడలో ఓ షాపు, నందిగామలో మరో షాపు నుంచి మద్యం సరుకును బయటి వ్యక్తులకు పంపించినట్టు తెలిసింది. అలాగే, గన్నవరం మండలంలో ఒక షాపు, మచిలీపట్నంలో రెండు షాపుల్లోనూ ఇలాగే జరిగిందని గుర్తించారు. బెల్టు షాపులు నిర్వహించినా, మద్యం దుకాణాల్లో సరుకును బయట వ్యక్తులకు విక్రయించినా రూ.5 లక్షలు జరిమానా విధించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. మొదటిసారి పట్టుబడితేనే ఈ జరిమానా విధిస్తారు. రెండోసారి అయితే షాపు లైసెన్స్ రద్దు చేస్తారు. ఈ చర్యలను ఎక్సైజ్ శాఖ కమిషనర్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఐదు షాపులపై చర్యలు తీసుకోవాలని సిద్ధం చేసిన ప్రతిపాదనలను త్వరలో కమిషనర్ కార్యాలయానికి పంపుతున్నట్టు అధికారిక వర్గాలు తెలిపాయి.

**• విజయ చిహ్నం**



మచిలీపట్నం రుస్తుంబాద మున్సిపల్ బాలికల పాఠశాలలో శనివారం జరిగిన పేరెంట్స్ మీట్‌లో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. విద్యార్థినులతో సరదాగా మాట్లాడి సెల్ఫీలు దిగారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు కూడా పాల్గొన్నారు.

6లో

# కల్యాణం.. కమనీయం

- కనులపండువగా సుబ్బారాయుడి కల్యాణోత్సవం
- మోపిదేవిలో పండుగ వాతావరణం

6లో

# టెండర్ల రద్దు వెనుక గూడుపుఠాణి

- నచ్చిన కాంట్రాక్టర్లు దొరకలేదా...?
- కూటమి ఎమ్మెల్యేల ఒత్తిడా...?

8లో

**కొన్ని తెరిచి, పూర్తిగా రద్దు చేసిన గుడివాడలోని డ్రెయినేజీ అధికారులు**

# దివి పల్లెల్లో రోడ్ల పండుగ

ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి కానరాక కునారిల్లిన దివి పల్లెల్లో నేడు రోడ్ల పండుగొచ్చింది. నిన్నమొన్నటి వరకు బురదకయ్యలుగా నడిచేందుకూ వీలులేని అవనిగడ్డ నియోజకవర్గంలోని పల్లెల్లో నేడు సీసీ రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది.

- అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.30.68 కోట్లతో శరవేగంగా నిర్మితమవుతున్న 496 సీసీ రోడ్లు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామీణ ప్రజలు



ఘంటసాలపాలెంలో సీసీ రహదారి నిర్మాణం (నేడు)



ఘంటసాలపాలెంలో అధ్వానంగా ఉన్న రహదారి (నాడు)

**(ఆంధ్రజ్యోతి - అవనిగడ్డ బృందం)**

రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యంగా వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాలను అభివృద్ధి చేయాలని తలచింది. అందులో భాగంగా పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలు పేరుతో గ్రామసభలు నిర్వహించింది. అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.30.68 కోట్లతో 48.730 కిలోమీటర్ల పొడవున 496 సీసీ రహదారుల నిర్మాణానికి వెనువెంటనే పనులు ప్రారంభించింది. గ్రామసభల నిర్వహణ, పనుల ఆమోదం, అంచనాల తయారీ, నిధుల విడుదల, గ్రామాల్లో పనులు మొదలు కావటం ఒక దాని వెంట ఒకటి వెనువెంటనే జరగడంతో పల్లెల్లో ప్రజలు ప్రభుత్వ పనితీరుపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### అవనిగడ్డ మండలంలో రూ.6.25 కోట్లతో 117 రోడ్లు

అవనిగడ్డ మండలంలో రూ.5.49 కోట్లతో 9,061 మీటర్ల మేర 104 సీసీ రహదారులు నిర్మితమవుతున్నాయి. వీటికి అదనంగా రూ.76.20 లక్షలతో మరో 1270 మీటర్ల రహదారులకు నిధులు మంజూరయ్యాయి. 13 రహదారులను అదనంగా నిర్మిస్తున్నారు. అవనిగడ్డ మండలంలో మొత్తం రూ.6.25 కోట్లతో 117 సీసీ రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. లంకమ్మ మాన్యం, రాజశేఖరపురం కాలనీల్లో నిన్నటి వరకు బురద రహదారులపై నడిచిన ప్రజలు ఇప్పుడు కొత్త సీసీ రహదారులను చూసి సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

### మోపిదేవి మండలంలో రూ.5.63 కోట్లతో 86 రోడ్లు

మోపిదేవి మండలంలో రూ.4.73 కోట్లతో 79 సీసీ రహదారులు తొలుత మంజూరయ్యాయి. మరో రూ.90 లక్షలు మంజూరు కావటంతో మొత్తం రూ.5.63 కోట్లతో 8,899 మీటర్ల మేర 86 సీసీ రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వెంకటాపురం బీసీ కాలనీలో సీసీ రహదారి వేయడంతో బురదలో తిరిగే బాధ తప్పిందని అక్కడి ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికే మండలంలో 36 సీసీ రహదారుల నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

### చల్లపల్లి మండలంలో రూ.5.5 కోట్లతో 90 రోడ్లు

చల్లపల్లి మండలంలో రూ.3.96 కోట్లు తొలివిడతగా, మరో రూ.1.8 కోట్లు రెండో విడతగా మంజూరయ్యాయి. మొత్తం రూ.5.5 కోట్లతో 8,943 కిలోమీటర్ల పొడవున 90 సీసీ రహదారుల పనులు సాగుతున్నాయి. ఇప్పటివరకు 11 రహదారుల పనులు పూర్తయ్యాయి. నిన్నమొన్నటి వరకు నడిచేందుకు వీలు లేని చల్లపల్లి గౌడపాలెంలోని బండ్రేవు కోడు పక్కన రహదారిపై నేడు వాహనాల్లో రాకపోకలు సాగిస్తున్నామని అక్కడి ప్రజలు సంతోషంగా చెబుతున్నారు.

### కోడూరు మండలంలో రూ.4.47 కోట్లతో 68 రోడ్లు

తీర ప్రాంత మండలం కోడూరులో రెండు విడతల్లో మొత్తం రూ.4.47 కోట్లు మంజూరు కాగా, 6,861 మీటర్ల మేర 68 సీసీ రహదారుల నిర్మాణపనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటివరకు 20 రోడ్ల నిర్మాణం పూర్తయింది. కోడూరు శివారు యర్రారెడ్డిపాలెంలో నిర్మించిన సీసీ రహదారి గ్రామంలో రాకపోకలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అక్కడి ప్రజలు ఆనందంతో చెబుతున్నారు.

### నాగాయలంక మండలంలో రూ.5.11 కోట్లతో 81 రోడ్లు

తీర ప్రాంత మండలం నాగాయలంకలో రెండు విడతల్లో మొత్తం రూ.5.11 కోట్లు మంజూరు కాగా, 8361 కిలోమీటర్ల పొడవున 81 సీసీ రహదారులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 25 రోడ్ల నిర్మాణం పూర్తయింది. నాగాయలంక సంత మార్కెట్ పక్కన పల్లెపాలెం వెళ్లే రహదారి నిర్మించడంతో ప్రజలు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

### ఘంటసాల మండలంలో రూ.3.7 కోట్లతో 54 రోడ్లు

ఘంటసాల మండలంలో రెండు విడతల్లో మొత్తం రూ.3.7 కోట్లు 5,335 మీటర్ల పొడవునా 54 సీసీ రహదారుల పనులకు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 24 రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఘంటసాలపాలెంలో ఇంతకాలం తాము బురదలో తిరిగామని, నేడు సీసీ రహదారి నిర్మాణం పూర్తి కావొస్తోందని అక్కడి ప్రజలు చెబుతున్నారు.

### మొన్నటిదాకా మోకాల్లోతు నీళ్లలో తిరిగాం



రాజశేఖరపురం కాలనీకి వచ్చి పదేళ్లు దాటిపోయింది. రహదారి సౌకర్యం లేక మోకాటి లోతు నీటిలో బురదలో తిరిగాం. ఇంత లోతున ఉన్న ఈ రోడ్డు వేస్తారని అనుకోలేదు. కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మించింది. ఇప్పుడు పిల్లలు సైకిళ్లు, మోటార్ సైకిళ్లపై తిరుగుతున్నారు. **- అర్జా లక్ష్మి, రాజశేఖరపురం**

### ఐదేళ్ల తర్వాత అభివృద్ధి చూస్తున్నా



గడిచిన ఐదేళ్లలో ఎన్నోసార్లు నేను పుట్టిన ఈ ప్రాంతానికి వచ్చాను. గ్రామాల్లో అభివృద్ధి జాడ కనిపించేది కాదు. 2014 నుంచి 2019 వరకు 33,000 కిలోమీటర్లు మేర పల్లెల్లో సీసీ రహదారులు వేశారు. ఇది దేశంలోనే అత్యధికం. మళ్లీ చంద్రబాబు వస్తేనే పల్లెలు మారతాయి అనుకున్నాం. ఆయనకు పవన్‌కల్యాణ్ తోడయ్యారు. ఐదేళ్ల తర్వాత మళ్లీ పల్లెల్లో అభివృద్ధి చూస్తు న్నా. అవనిగడ్డ నియోజకవర్గంలో తొలివిడతగా 496 రోడ్లు మంజూరై, వాటి పనులు వేగంగా సాగడం చాలా సంతోషాన్నిస్తోంది.
**-బొబ్బా గోవర్ధన్, ఎన్ఆర్ఐ**



కోడూరు మండలం లింగారెడ్డిపాలెంలో అధ్వానపు రహదారి (నాడు), లింగారెడ్డిపాలెంలో సీసీ రహదారి నిర్మాణం (నేడు)



# కల్యాణం.. కమనీయం

## కన్నులపండువగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం



మంగళసూత్రాలు భక్తులకు ప్రదర్శిస్తున్న అర్చకులు

**మోపిదేవి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శనివారం కన్నులపండువగా జరిగింది. మార్గశిర షష్టి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామికి ప్రాతఃకాలార్చనలు, గోపూజ, నిత్యహోమం, బలిహరణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. స్వామి, అమ్మవార్లను విశేష అలంకరణ చేసిన శేషవాహనంపై ఆశీనులు గావించి కల్యాణ మహోత్సవాన్ని అర్చక బృందం నిర్వహించారు. దేవదాయశాఖ, చల్లపల్లి రాజవంశీయుల తరపున నూతన పట్టువస్త్రాలను ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు సమర్పించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ గావించగా, వందల మంది దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ప్రధాన అర్చకుడు బుద్దు పవన్ కుమార శర్మ ఆధ్వర్యంలో కల్యాణ ఘట్టం ప్రారంభించారు. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తుల జయజయ ధ్వానాల నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపించారు. మంగళసూత్రాలు భక్తులకు ప్రదర్శించి, మంగళధారణ కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాఅన్నసమారాధనను ఆలయ ఈవో పర్యవేక్షించారు. మోపిదేవి కేడీసీసీ బ్రాంచ్, మండలంలోని పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 3 వేల వాటర్ బాటిళ్లు, 1500 మజ్జిగ ప్యాకెట్లను బ్రాంచ్ మేనేజర్ సల్మానా భక్తులకు అందజేశారు. మచిలీపట్నం ఆర్డీవో ఎం.స్వాతి కుటుంబసమేతంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. షష్ఠి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఆర్డీవో దంపతులను ఆలయ అర్చకులు శేషవస్త్రంతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

### వైభవంగా గ్రామోత్సవం



**మోపిదేవి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి కల్యాణమహోత్సవాలలో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. ఉదయం స్వామి దివ్య కల్యాణ మహోత్సవం అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మయూర వాహనంపై స్వామిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పసుపు, కుంకుమలు కొబ్బరికాయలు సమర్పించి స్వామిని దర్శించుకున్నారు.





రుస్తుంబాద మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాల పేరెంట్స్-టీచర్స్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర



జైహింద్ స్కూల్ మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

# మచిలీపట్నంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ కేంద్రం

- ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం పెడతాం
- బందరులో 2,3 తేదీల్లో యువకెరటాలు నిర్వహిస్తాం
- పేరెంట్స్-టీచర్స్ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి)** : ఆంధ్ర జాతీయ కళాశాలలో గ్లోబల్ ఎడ్యుకేషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తామని, మచిలీపట్నానికి విద్యారంగంలో పూర్వ వైభవం తెస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రుస్తుంబాద మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో డీఈవో రామారావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన పేరెంట్స్-టీచర్స్ సమావే శంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, మునిసిపల్, జిల్లాపరిషత్ పాఠశాలలను బలోపేతం చేసేందుకు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చక్కటి ప్రణాళిక రూపొందించారన్నారు. ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెడతామన్నారు. మచిలీపట్నం పాలిటెక్నిక్ కళాశాలకు శాశ్వత భవ నం నిర్మిస్తామన్నారు. 2025 జనవరి 2,3 తేదీల్లో మచిలీపట్నంలో యువకెరటాలు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. విద్యా సంస్థల్లో గంజాయి, డ్రగ్స్ అరికట్టేందుకు ఈగల్ పవర్‌ను వినియోగిస్తున్నామన్నారు. విద్యార్థినుల తల్లులు వేసిన ముగ్గులను తిలకించారు. టగ్ ఆఫ్ వార్ పోటీలో పాల్గొన్నారు. విద్యార్థులు గీసిన బొమ్మలు, చిత్రాలను తిలకించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేపీ నాయకుడు సోడిశెట్టి బాలాజీ, పేరెంట్స్-టీచర్స్ కమిటీ చైర్మన్ ఆదిలక్ష్మి, ఎంఈవో దుర్గాప్రసాద్, హెచ్ఎం కృష్ణమూర్తి పాల్గొన్నారు.

### పట్టుదల, కృషితోనే విజయాలు : ఎస్పీ

**మచిలీపట్నం టౌన్** : విద్యార్థులు పట్టుదల, కృషితో విజయాలు సాధించాలని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు అన్నారు. జైహింద్ సెకండరీ స్కూల్‌లో మెగా పేరెంట్స్ టీచర్స్ డేలో ఆయన మాట్లాడారు. హెచ్ఎం కృష్ణమూర్తి, ఇనకుదురు సీఐ రామారావు తదితరులు పాల్గొన్నారు. కానూరులో తెలుగురైతు అధ్యక్షుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్నాపురంల మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. కాలేఖాన్‌పేట మునిసిపల్ హైస్కూల్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాల స్థలదాత గోపు శారదాదేవి విద్యార్థులకు నిర్మించిన సైకిల్‌షెడ్‌ను గోపీచంద్ ప్రారంభించారు.

**ఘంటసాల** : పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకే ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. లంకపల్లి జడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ - టీచర్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పూర్వ విద్యార్థి యార్లగడ్డ వెంకట రమణను మంత్రి కొల్లు రవీంద్ర అభినందించారు. మంత్రి రవీంద్రను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ డి.విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు, హెచ్ఎం పి.చారులత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రమశిక్షణతో కూడిన విద్య అందిస్తున్నారని సర్పంచ్ దోనె రజని పేర్కొన్నారు. చాట్రగడ్డ దళితవాడలో ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. పీఈటీ జి.వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు. అశ్వారావుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం రవికుమార్ అధ్యక్షతన పేరెంట్స్ డే నిర్వహించారు. సర్పంచ్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్, విద్యాకమిటీ చైర్మన్ విజేతలకు బహుమతులు అందజేశారు.

### ఉపాధ్యాయులే కీలకం

**బంటుమిల్లి** : ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర విశిష్టమైనదని మండల ప్రత్యేక అధికారి నిత్యానందం అన్నారు. అన్ని ప్రభ్వు పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేర్సెంట్ టీచర్స్ డే జరిగింది. ఎంపీపీ వెలివెల చినబాబు, అంగరరంగ రాంబాబు, వర్రే వెంకటేశ్వరరావు, బండ్రెడ్డి శివరామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. తొలుత వాసవ్య మండలి సభ్యులు బాలికలకు బాల్య వివాహాలు నిషేధించాలని ప్లకార్డులను ప్రదర్శించారు.

### విద్యతోనే ఉజ్వల భవిష్యత్

**మోపిదేవి** : విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ రావి దుర్గావాణి అన్నారు. గురుకుల పాఠశాల పేరెంట్స్ - టీచర్స్ డేలో ఆమె మాట్లాడారు. కొక్కిలిగడ్డ ప్రాథమికోన్నత పాఠశాలలో సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, కె.కొత్తపాలెంలో కొక్కిలిగడ్డ మాధవి, పెదకల్లేపల్లి జడ్పీ పాఠశాలలో అరజా సంధ్యారాణి పేరెంట్స్ డే కార్యక్రమంలో పాల్గొని పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

**కోడూరు** : విద్యార్థుల అభ్యున్నతి, నిరంతర పర్యవేక్షణకే ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో టివిఎం.రామదాసు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని సందేశమిచ్చారు. స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎం వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎంపీపీ కొండవీటి వెంకటరమణ, జడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీను నాయక్, ఎస్సై కె.చాణక్య వైద్యాధికారి శిరీష పాల్గొన్నారు. **చల్లపల్లి** : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ డే పండుగ వాతావరణంలో నిర్వహించారు. పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంఈవో పి.వెంకటేశ్వరరావు, వైస్‌ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కైతేపల్లి దాస్ పాల్గొన్నారు. మంగళాపురంలో వైస్ ఎంపీపీ పిట్టు వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డ ప్రభుత్వ పాఠశాల మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్‌లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



పెనమల్లి జడ్పీ హైస్కూల్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

### అవనిగడ్డ పాఠశాల అభివృద్ధికి సహకారం

**అవనిగడ్డ** : అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. మండలి వెంకట్రామ్, ఎంపీపీ తుంగల సుమతి దేవి, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో మరియదేవి, వైస్ ఎంపీపీ దిడ్ల కిరణ్, ఎంఈవో శివశంకర్ రావు, ప్రధానోపాధ్యాయులు జి.ఎన్.బి.గోపాల్, పాఠశాల చైర్మన్ మద్దాల మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు చదువే ఆస్తి

**అవనిగడ్డ రూరల్** : విద్యార్థులకు చదువే ఆస్తి అని, చదువుతోనే జీవితంలో పురోగమిస్తారని గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ అన్నారు. పులిగడ్డ గురుకుల విద్యాలయంలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు. ప్రిన్సిపాల్ ఎస్.టి.పి.కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించగా, ఏఎంసీ చైర్మన్ ఎస్.జ్యోత్స్న, వైస్ చైర్మన్ ఎస్.రమేష్, నాథ్, ఎంఈవోలు బాలత్రిపురసుందరి, ఏ వెంకటేశ్వరరావు, ఎస్సై గణేష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

**పెడన రూరల్** : క్రమశిక్షణతో విద్యభ్యసించి ఉన్నత స్థితికి చేరాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పెనుమల్లి హైస్కూల్ ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డీవైఈవో బి.శ్రీనివాస్ శేఖర్ సింగ్, మండల ప్రత్యేక అధికారిణి పద్మావతి, జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, ఎంఈవో హరినాథ్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, ఒడుగు తులసీరావు, కాట్రగడ్డ నాగరాజు, రజని పాల్గొన్నారు.

### క్రమశిక్షణే ముఖ్యం

**నాగాయలంక** : విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలని తహసీల్దార్ ఎం.హరనాథ్ కోరారు. నాగాయలంక ఆదర్శ పాఠశాలలో ఆత్మీయ సమావేశంలో ఆయనతో పాటు ఎంపీడీవో జె.సీతారామ్ కుమార్, వైద్యాధికారి కె.శివరామకృష్ణ, సర్పంచ్ కైతేపల్లి అంకాలు, ఎంఈవో ఏ.రామారావు, ప్రధానోపాధ్యాయులు కొల్లూరి మోహనరావు పాల్గొన్నారు. తలగడదీవి జడ్పీ పాఠశాల ఆత్మీయ సమావేశంలో ఎస్సై కె.రాజేష్ విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మద్దాల కోటేశ్వరమ్మ, వర్రే

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 101, 109, 120 |
| చికెన్ విత్ స్కిన్ | 194 |
| చికెన్ స్కిన్‌లెస్ | 204 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.620

## వైష్ణవ క్షేత్రాల సందర్శనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**ఉయ్యూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :** ధనుర్మాసం పురస్కరించుకుని వైష్ణవ క్షేత్రాల సందర్శనకు ఉయ్యూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ తెలిపారు. ఈనెల 13 , 14, 20, 21, 27, 28 తేదీల్లో ప్రతిశుక్ర, శనివారాల్లో సూపర్‌లగ్జరీ బస్సు రాత్రి 10 గంటలకు బయలుదేరి పామర్రు, మచిలీపట్నం, పెడన, బంటుమిల్లి, నర్సాపురం మీదుగా అనంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి, అప్పనపల్లి బాలబాలాజీ స్వామి, గొల్లల మామిడాడ కోదండరామస్వామి, అన్నవరం సత్యనారాయణ స్వామి, ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయాలకు సర్వీసులు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. టిక్కెట్ ఒక్కరికి రూ.1400, గ్రూపులుగా వెళ్ల వలసిన వారికి కావలసిన తేదీల్లో బస్సు ఏర్పాటుచేస్తామన్నారు. వివరాలకు 7382893468, 8919366868, 7382925701 సెల్ నంబర్లకు ఫోన్ చేయవచ్చని తెలిపారు.



పోరంకిలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ



పెనమలూరులో విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్




రామవరప్పాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

# మెరుగైన విద్యనందించటమే ప్రభుత్వ లక్ష్యం

**పెనమలూరు, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి):**
పెనమలూరు, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి పట్టుదలతో పాటు కృషి అవసరమని కలెక్టర్ బాలాజీ అన్నారు. పోరంకి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన మెగా పేరెంట్స్ టీచర్సు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులతో వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించాలంటే ఉన్నత స్థానాలకు చేరిన వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, పాఠశాల హెచ్ఎం సుమలత, డిప్యూటీ ఈవో పద్మరాణి, ఎంపీడీవో ప్రణవి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కోరారు. పెనమలూరు ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన మెగా పేరెంట్-టీచర్సు ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రణాళికలు రూపొందించుకొని అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. వైసీపీ హయాంలో విద్యాశాఖను భ్రష్టు పట్టించి అర్థం లేని విధానాలను విద్యార్థులపై రుద్ది పాఠశాలలకు దూరం చేశారని దుయ్యబట్టారు. తాడిగడప ఉన్నత పాఠశాల, కానూరు ఉన్నత పాఠశాల, పెదపులిపాక ఎంపీయూపీ పాఠశాల, పోరంకి ఉన్నత పాఠశాల, వివిధ గ్రామాల్లో ఈ ఆత్మీయ సమావేశాలు పెద్దఎత్తున జరిగాయి. పెనమలూరు, పెదపులిపాకల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచులు గుంటూరు శ్రీనివాసచౌదరి, లింగాల భాస్కరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మెగా పేరెంట్స్ డే-టీచర్స్ ఆత్మీయ సమావేశాలకు విశేష స్పందన

**మొదటి గురువు తల్లిదండ్రులే..**

**ఉయ్యూరు :** విద్యార్థులకు మొదటి గురువులు తల్లి తండ్రులే అని పిల్లలను బడికి పంపించడంతో బాధ్యత తీరిపోతుందనుకోకుండా పిల్లల ప్రవర్తన, అలవాట్లు, ఏమీ చదువుతున్నారన్న దానిపై ఆరాతీయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ డేకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు, ఎంఈవో-2 బి.సుధారణి, ఎస్ఎంసీ చైర్మన్ ఆరేపల్లి శివసాయిప్రసాద్, ప్రధానోపాధ్యారాలు జోత్స్నాదేవి తదితరులు పాల్గొన్నారు.

**విద్యాలయాలే.. దేవాలయాలు**
**ఎమ్మెల్యే యార్లగడ్డ**

**ప్రసాదంపాడు:** విద్యాలయాలను దేవాలయాలుగా భావించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు. రామవరప్పాడు, నిడమానూరు జిల్లా పరిషత్ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఈ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకారంతో పాటు తన సహకారం ఉంటుందన్నారు.ఎంఈవోలు అరూరు వెంకటరత్న, సూరిబాబు, విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన రామారావు, సర్నాల బాలాజీ, బండి వెంకట్రావు, గూడవల్లి నరసింహారావు, కొల్లా ఆనంద్ పాల్గొన్నారు.

**ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యా విధానం**

**హనుమాన్‌జంక్షన్:** ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా విధానం అమలు చేస్తున్నట్లు ఉపాధ్యాయులు అన్నారు. బాపులపాడు జడ్పీ పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్ డేలో ఎంపీపీ వై.నగేష్, జడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షకార్యదర్శులు సుంకర సుభాష్ చంద్రబోస్, వీరమాచనేని సత్యప్రసాద్, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, తదితరులు ప్రసంగించారు. హెచ్ఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పిల్లల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఎంఈవో రాంబాలసింగ్, ఎస్సై సతీష్ పాల్గొన్నారు.

**పిల్లల సంఖ్య పెంచాలి**

**కంకిపాడు:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు కృషి చేయాలని కంకిపాడు మండల పరిషత్ అధ్యక్షురాలు నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. కంకిపాడులో పేరంట్స్ ఆత్మీయ సామావేశాన్ని ఓ పండుగ వాతావరణంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.ఎస్.వి ప్రసాద్, పేరంట్స్ కమిటీ చైర్మన్ అజ్గర్ షరీఫ్ పాల్గొన్నారు. తెన్నేరులో జరిగిన పేరంట్, టీచర్స్ ఆత్మీయ సమావేశం జరిగింది.

**విద్యార్థుల ప్రగతే లక్ష్యంగా..**

**గన్నవరం:** విద్యార్థుల ప్రగతిని మరింత మెరుగు పరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఈవో కొండా రవికుమార్ అన్నారు. పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్స్ శనివారం జరిగాయి. తల్లిదండ్రులకు ముగ్గులు, తాడు లాగుడుపోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం డి.ఝాన్సీ రాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-2 కమల, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ మద్దుకూరి విజయకుమార్ పాల్గొన్నారు. దావాజీగూడెం సర్పంచ్ బాలమ్మ, హెచ్ఎం జె.కుమారిపాల్గొన్నారు.

**పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలి.**

**హనుమాన్‌జంక్షన్‌రూరల్:** తమ పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టిపెట్టాలని ఎంఈవో రాంబాలాసింగ్ అన్నారు. ఆరుగొలను, వేలేరు, రేమల్లె, వీరవల్లి, కానుమోలు తదితర హైస్కూళ్లతో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్ లాంటి క్రీడాపోటీలను నిర్వహించారు. వీరవల్లి, ఆరుగొలను, కానుమోలు, మల్లవల్లి, కోడూరుపాడు తదితర గ్రామాల్లో పాఠశాలల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ చందు రమాదేవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు. మెగా పేరెంట్స్ - సమావేశాల్లో పలువురు ప్రముఖులు పాల్గొని విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

**ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి..**

**ఉంగుటూరు :** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా అబ్జర్వర్లు, సమగ్రశిక్ష ఏఎస్‌వో డి.నగేష్, ఐఈడీ(భవిత)కోఆర్డినేటర్ ఎస్.రాంబాబు అన్నారు. తేలప్రోలు జడ్పీహైస్కూల్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. మండలంలోని 48 ప్రభుత్వపాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పాఠశాలలను మామిడి తోరణాలు, రంగవల్లులతో అందంగా అలంకరించి తల్లిదండ్రులకు ఘన స్వాగతం పలికారు. మహిళలకు ముగ్గులపోటీలు, మగవారికి తాడులాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



రహదారి నాణ్యతాప్రమాణాలు పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాస్

## నాణ్యతాప్రమాణాలు పాటించండి

### కాంట్రాక్టర్లకు క్వాలిటీ కంట్రోల్ డీఈ శ్రీనివాస్

**ఉప్పలూరు (కంకిపాడు), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :** రహదారుల అభివృద్ధిలో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డీఈ పోలవరపు శ్రీనివాస్ అన్నారు. ఉప్పలూరు గ్రామంలో రూ. 12 లక్షలతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వంప్రతిష్టాత్మకంగా తీసుకొని రహదారుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. నిర్మాణంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మారేడుమాక గ్రామంలో రూ. 30 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు, జగన్నాథపురంలో రూ. 9.90 లక్షలతో స్కూల్ ప్రహరీ, గొడవర్రులో రూ. 28 లక్షలు, రూ. 30 లక్షలతో రహదారి, కాసరనేనివారి పాలెం రూ. 45 లక్షలతో బీటీ రోడ్డు అభివృద్ధి పనుల్లోని నాణ్యత ప్రమాణాలను పరిశీలిచినట్లు డీఈ తెలిపారు. క్వాలిటీ కంట్రోల్ జేఈ కర్రా శ్రీనివాసరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## రూ.23 కోట్లతో అభివృద్ధి పనులు

**కంకిపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :** అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోనే రూ. 23 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కృషి చేయడం అభినందనీయమని తెలుగురైతు జిల్లా కార్యదర్శి గోగినేని వెంకరమణ అన్నారు. కంకిపాడులోని బి.బి.ఆర్ నగర్‌లో రూ. 15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు అభివృద్ధి పనులను శనివాంరం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల్లో రహదారులు అభివృద్ధి పక్కన పెడితే ప్యాచ్ వర్కు అయినా చేశారా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోనే కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తుందన్నారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి పనులను స్థానిక కూటమి నాయకులు పరిశీ లించాల్సిన అవసరముందని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొండా నాగేశ్వరరావు, పులి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

**మౌలిక వసతులను మెరుగుపరచుకుందాం**

**పెనమలూరు:** నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయినేజీలు, మంచినీటి వసతి తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చి అభివృద్ధి చేసుకొందామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. తాడిగడప మునిసిపాలిటీ పోరంకిలోని శివసదన్ వద్ద శనివారం రూ.39లక్షల సాధారణ నిధులతో 325మీటర్ల పొడవున నిర్మించ తలపెట్టిన రోడ్డుకు శంకుస్థాపన చేశారు. గత ఐదేళ్ల వైసీపీ విధ్వంస పాలనలో రోడ్లన్నీ ధ్వంసమై య్యా యన్నారు. కార్యక్రమంలో కూటమి పాల్గొన్నారు.

**ఆలయానికి విరాళం**

**హనుమాన్‌జంక్షన్ :** బాపులపాడు దాసాంజనేయ స్వామి ఆలయానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేరిట గన్నవరం నియోకవర్గం మీడియా కోఆర్డినేటర్ గరికపాటి శివశంకర్ రూ.10వేలు విరాళం అందించారు. బాపులపాడు దాసాంజనేయ స్వామి ఆలయంలో ఫిబ్రవరి నెలలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు



# కన్నుల పండువగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) :** సుబ్రహ్మణ్యషష్టి సర్వోత్తమమైనదని అర్చకులు కుందుర్తి శ్యామ్ తెలిపారు. వేలేరు, ఆరుగొలను, పెరికీడు తదితర గ్రామాల్లో శనివారం సుబ్రహ్మణ్యషష్టి సందర్భంగా విశేషపూజలు, స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేలేరులోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో అవిర్నేని హరనాథ్‌బాబు, రంగమ్మ దంపతుల ఆధ్వర్యంలో తుమ్మల నారాయణరావు, లక్ష్మి దంపతులు స్వామి అంగరంగ వైభవంగా నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్ ఎస్సై-2 మూర్తి ప్రత్యేక పూజలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. తదనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. పెరికీడులో స్వామికి పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. ఆరుగొలనులో అర్చకులు దేవంభట్ల పురుషోత్తమశర్మ ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. మల్లవల్లి, రంగన్నగూడెం తదితర గ్రామాల్లో వైభవంగా నిర్వహించినవేడుకల్లో మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## సీతారామచంద్రస్వామికి సహస్రనామార్చన



**గన్నవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** దావాజీగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం ఆంజనేయస్వామికి 11వేల తమలపాకులతో సహస్రనామార్చన జరిగింది. తొలుత ఆలయ అర్చకులు రామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు తమలపాకులతో సహస్రనామార్చన చేసి వివిధ రకాల పరిమళ భరిత పుష్పమాలలతో విశేష అలంకరణ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## వైభవంగా బాలాంబతల్లి వార్షికోత్సవం

**ఉంగుటూరు :** మానికొండగ్రామదేవత బాలాంబతల్లి అమ్మవారి వార్షికోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. గణపతి పూజ జరిపి, ఆతర్వాత పంచామృతాలు, వివిధరకాల ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ, కుంకుమపూజ, నీరాజనమంత్ర పుష్పం సమర్పించారు. బాలాంబతల్లికి పసుపు. కుంకుమలు, పూలు,గాజులు, కొబ్బరికాయలు, పండ్లు, పట్టు చీరెలు, పాలపొంగళ్లు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ పెద్దలు ఆరికట్ల రవికుమార్, చింతా వాసుబాబు, పట్టికూటి కిషోర్‌కుమార్, షేక్ దాదా, పులిబండ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**హనుమాన్‌జంక్షన్,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టులను భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బాపులపాడు తహసీల్దార్ వి. నాగభూషణం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలిపారు. మండంలో అంపాపురం ( బీసీ మహిళ), ఏ.సీతారాంపురం (బీసీ-డి), బాపులపాడు(ఓసీ మహిళ), కానుమోలు (ఓసీ), కోడూరుపాడు(ఓసీ), కొయ్యూరు(బీసీ మహిళ), ఏ.సీతారాంపురం(బీసీ-బీ) దుకాణాలకు డీలర్లను ఎంపిక చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ నెల 13 తేదీ లోపు దరఖాస్తులు అందించాలన్నారు. ఈ నెల 18న రాత పరీక్ష, 21న మౌఖిక పరీక్ష ఉంటుందన్నారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత, 27 నవంబరు 2024 నాటికి 18 నుంచి 40 సంవత్సరాలు మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను గుడివాడ ఆర్డీవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

## రేపటి నుంచి పిన్నమనేనిలో రక్త పరీక్షలు

**గన్నవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ జనరల్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు రక్త పరీక్షలు ఉచితంగా ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకూ చేస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూవిలువైన స్కానింగ్‌లు కూడా అతితక్కువ ఫీజుకే చేస్తున్నామని తెలిపారు. పరీక్షలకు వచ్చే వారు ఆధార్ కార్డును తప్పని సరిగా తీసుకురావాలన్నారు. 72074-53325 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## తుమ్మల సత్య మృతి పార్టీకి తీరని లోటు

**హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** సీనియర్ టీడీపీ నేత తుమ్మల సత్యనారాయణ(సత్య) మృతికి తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి సంతాపం తెలిపారు. అనారోగ్యంతో మృతి చెందిన సత్యపార్థీవ దేహాన్ని శనివారం ఆయన నివాసంలో (విజయవాడ) ఉంచారు. అమరావతి సాధన ఉద్యమంలో సత్య నిర్వహించిన పాత్ర మరువలేనిదని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని కల్యాణి అన్నారు.

## మంచి ఆహార అలవాట్లు నేర్పాలి

**ఉయ్యూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :** చిన్ననాటి నుంచి విద్యార్థులకు మంచి ఆహారపు అలవాట్లు అలవరుచుకునే చేయాలని చెరకు పరిశోధన స్థానం శాస్త్రవేత్త శైలజారాణి అన్నారు. ఎంకే ఇంగ్లీషుమీడియం హైస్కూల్‌లో ప్రాథమిక తరగతుల విద్యార్థులు, తలితండ్రులకు శనివారం నిర్వహించిన లిటిల్ చెఫ్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థుల తలితండ్రులు వారి పిల్లలతో వివిధ రకాల వంటలు తయారు చేయించి విజేతలకు స్కూల్ డైరెక్టర్ ఎంకే బాబు బహుమతులు అందచేశారు.

## 9వ తేదీలోపు ఓటు నమోదు చేసుకోవాలి

**గన్నవరం :** ఎమ్మెల్సీ ఓటు నమోదుకు 9వ తేదీ ఆఖరి అని అర్హులు ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కె.వి. శివయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2021 నవంబరు 1వ తేదీలోపు డిగ్రీ పట్టా పొంది ఓటరు లిస్టులో ఓటరుగా నమోదు అయి ఉండాలని తెలిపారు. పట్టభద్రులు డిగ్రీ ప్రొవిజనల్, ఆధార్, ఓటర్ ఐడీ జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### పర్యాటక ఆకర్షణ

చల్లపల్లి కోటకు మూడున్నర శతాబ్దాల చరిత్ర ఉన్నట్లు చెబుతారు. ఈ కోట పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంది. సుదూర ప్రాంతాలు, దివి ప్రాంతంలోని పుణ్యక్షేత్రాలను చూసేందుకు వచ్చినవారు చల్లపల్లి వచ్చి కోటను చూసి వెళుతుంటారు. సుమారు 20 ఎకరాల్లో ఉండే కోట, కోట బురుజులు, పచ్చదనానికి, ప్రశాంతతకు చిహ్నంగా ఉండే అశోక వృక్షాలు, విశాలమైన ఆవరణ, పూర్వకాలం నాటి జాడీలు, నాటి శిల్పసంపద, ఎత్తైన ప్రధాన ద్వారం సందర్శకులకు ఆకర్షిస్తుంది. చల్లపల్లి రాజా మనుమడు యార్లగడ్డ రామేశ్వరప్రసాద్ (అంకినీడు ప్రసాద్ కుమారుడు) కోటను గతంలో అభివృద్ధి చేశారు. కోట పైఅంతస్తులో దూలాలు దెబ్బతినటం, ఆర్చ్‌లు పాడవటంతో వాటికి మరమ్మతులు చేయించి సుందర రూపు తీసుకొచ్చారు. ప్రస్తుతం కోటకు ఇంకా మరమ్మతులు చేయాల్సి ఉంది. కోటను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే దివిసీమ పర్యాటకంగా అభివృద్ధి చెంది మరింతగా సందర్శకులు పెరిగే అవకాశం ఉంది.



చల్లపల్లి రాజా కోట ప్రవేశ ద్వారం

చరిత్రకు సజీవసాక్ష్యం

సండే స్పెషల్

# చల్లపల్లి కోట

- దేవరకోట సంస్థానానికి రాజధానిగా చల్లపల్లి ● పర్యాటకులను ఆకర్షించే రాజసౌధం
- జడ్పీ చైర్మన్‌గా, రాష్ట్రమంత్రిగా చల్లపల్లి రాజా ● నేటికీ కోటలో మోగే కంచు గంట

చల్లపల్లి.. ఈ పేరు చెబితే గుర్తుకొచ్చేది చల్లపల్లి రాజావారి కోట. నాలుగున్నర శతాబ్దాల చరిత్రకు సజీవసాక్ష్యంగా రాజా వారి రాచరికానికి చిహ్నంగా నిలుస్తోంది. చల్లపల్లి వచ్చిన వారెవరైనా కోట చూసి వెళ్లాల్సిందే. చల్లపల్లి రాజాగా పేరొందిన శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామప్రసాద్ బహద్దూర్ రాచరిక ప్రభువుగానే కాకుండా, ప్రజాప్రతినిధిగానూ ప్రజలకు సేవలందించారు. పర్యాటకులకు ఎంతగానో ఆకట్టుకునే చల్లపల్లి రాజా వారి కోట, వారి చరిత్రపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ఆంధ్రజ్యోతి - చల్లపల్లి

కృష్ణా మండలంలోని జమిందారీ సంస్థానాల్లో అతిపురాతనమైన వాటిలో దేవరకోట ఒకటి. చల్లపల్లి రాజధానిగా జమిందార్లు పరిపాలన చేపట్టారు. 190 చదరపు మైళ్ల జమీ వైశాల్యంతో ఉన్న చల్లపల్లి సంస్థానానికి 448ఏళ్ల చరిత్ర ఉంది. దీని పరిధిలో 66 గ్రామాలు, రెండు అగ్రహారాలు, పాలేలు, శివార్లు కలుపుకుని సుమారు 100 గ్రామాలకు పైనే ఉండేవి.



రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న చల్లపల్లి రాజా శ్రీమంతు యార్లగడ్డ శివరామ ప్రసాద్ బహదూర్ (పాతచిత్రం)

### రాచరికానికి 'ప్రజాప్రతినిధి'

చల్లపల్లి రాజాగా పేరొందిన శ్రీమంతు యార్లగడ్డ శివరామప్రసాద్ బహదూర్ రాచరికంలోనే కాక ప్రజాస్వామ్యంలోనూ రాణించారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవలందించి చిరస్థాయిగా నిలిచారు. కృష్ణాజిల్లా పరిషత్‌కు తొలి చైర్మన్‌గా వ్యవహరించారు. అవనిగడ్డ ద్విశాసనసభకు ఎన్నికైన చల్లపల్లి రాజా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. చల్లపల్లి రాజాకు ముగ్గురు కుమారులు మల్లికార్జున ప్రసాద్, అంకినీడుప్రసాద్, పద్మనాభప్రసాద్, ఇద్దరు కుమార్తెలున్నారు. రెండో కుమారుడు అంకినీడు ప్రసాద్ పార్లమెంటు సభ్యుడిగా పనిచేశారు. దేవరకోట సంస్థానంలో చిట్టచివరగా పట్టాభిషిక్తుడైన రాజు శివరామప్రసాద్ బహదూర్ మాత్రమే.

చల్లపల్లి రాజా పేరిట స్థాపించిన శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామప్రసాద్ జూనియర్ కళాశాల ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దింది. దివిసీమలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలుగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రం, పెదకళ్లేపల్లి శ్రీదుర్గా నాగేశ్వర క్షేత్రం, శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వరస్వామి దేవాలయాలకు చల్లపల్లి రాజా వంశీయులు వంశపారంపర్య ధర్మకర్తలుగా కొనసాగుతున్నారు. మచిలీపట్నంలో శివగంగ అమ్మవారి ఆలయానికి చల్లపల్లి రాజా వంశీయులే ధర్మకర్తలు. వీటితోపాటు యార్లగడ్డలోని శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయం సైతం ఎస్టేట్ ఆలయాల పరిధిలో ఉంది. చల్లపల్లి రాజా వంశీయులు సంగీత, సాహిత్యాభివృద్ధికి విశేష కృషిచేశారు. ప్రముఖ సంగీత విద్వాంసులు పారుపల్లి రామకృష్ణయ్య చల్లపల్లి ఆస్థాన పండితుడిగా ఉండేవారు. చల్లపల్లి రాజా వంశీయులు జగజ్జనని అమ్మవారిని పూజిస్తారు. కోటలో నేటికీ అమ్మవారికి నిత్యపూజలు జరుగుతుంటాయి. గతంలో పర్వదినాల్లో ప్రజలు అమ్మవారిని దర్శించేవారు. దీపావళి, దసరా సమయాల్లో కోటలో అమ్మవారికి పూజలు చేస్తుంటారు. ఆ ప్రదేశంలో ప్రతిరోజూ ముగ్గువేసి ఖాళీగా ఉంచుతారు. విజయదశమికి ఆయుధపూజ చేయటం నేటికీ ఆనవాయితీగా వస్తోంది.



చల్లపల్లి వంశీయుల వంశవృక్షం



సుందరంగా కోట లోపలి భాగం



### ప్రతి గంటా మోగంగా..

చల్లపల్లి కోటలో కంచు గంట ప్రతి గంటకూ మోగుతూనే ఉంటుంది. పూర్వకాలంలో ప్రజలకు సమయాన్ని తెలిపేందుకు కంచుతో తయారుచేసిన గంటలను ఏర్పాటుచేశారు. గడియారాలు అందుబాటులో లేని కాలంలో కోటలో గంటల సమయం ఆధారంగా ప్రతి నిత్యం దినచర్య ప్రారంభమయ్యేదని చెబుతుంటారు. పూర్వం కోటలో 4 గంటలు మోగుతుండేవి. కోటలో ఒకచోట, కోట ఆవరణ కింద భాగంలో, ఉత్తర, దక్షిణ దర్వాజాల వద్ద గంటలు మోగిస్తూ ఉండేవారు. తొలుత కోటలో గంట మోగించిన తర్వాత మిగిలిన చోట్ల గంటలు మోగించేవారు. శబ్దకాలుష్యం తక్కువగా ఉన్న ఆ రోజుల్లో కోట గంట చుట్టు పక్కల గ్రామాలకు సైతం వినిపించేదని చెబుతారు. కోట గంట ద్వారా సమయం తెలుసుకోవాల్సిన అవసరం లేకున్నా ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ నేటికీ 2 చోట్ల గంట మోగిస్తూనే ఉన్నారు. కోట ఆవరణలో ఒకచోట, దక్షిణంవైపు ప్రధాన ప్రవేశద్వారం వద్ద మరో గంట మోగిస్తున్నారు.

## టెండర్ల రద్దు వెనుక గూడుపుఠాణి

- నచ్చిన కాంట్రాక్టర్లు దొరకలేదా? ● ఎమ్మెల్యేల ఒత్తిడా?
- కొన్ని తెరిచి, పూర్తిగా రద్దు చేసిన డ్రైనేజీ అధికారులు

**ఆంధ్రజ్యోతి - గుడివాడ:** గత వైసీపీ ప్రభుత్వ జాడలు ఇంకా అధికారుల్లో కనిపిస్తున్నాయి. గతంలో వైసీపీ ఎమ్మెల్యేలకు అనుకూలంగా వ్యవహరించేందుకు డ్రైనేజీ శాఖ ఏకంగా మూడు సార్లు టెండర్లు రద్దు చేసింది. అప్పటి ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన వారికి, డ్రైనేజీ శాఖాధికారులకు అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లకు పనులు అప్పగించుకున్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం వచ్చినా అధికారుల్లో పెద్దగా మార్పులేదనే చెప్పాలి. ఇటీవల ఉమ్మడి కృష్ణాజిల్లాలోని గుడివాడ డ్రైనేజీ ఈఈ పరిధిలో ఇటీవల పిలిచిన టెండర్లను ఏకపక్షంగా రద్దు చేశారు.

గుడివాడ డివిజన్ పరిధిలోని 4 సెక్షన్లలో రూ.5.74 కోట్ల వ్యయంతో 29 పనులను చేపట్టేందుకు గత నవంబరు 11న టెండర్లు పిలిచి 25న తెరిచేందుకు సన్నాహాలు చేపట్టారు. టెక్నికల్ సమస్య కారణంగా డిసెంబరు 2 వరకు టెండరు దాఖలకు సమయాన్ని పొడిగించారు. ఐదేళ్ల తరువాత భారీస్థాయిలో రూ.కోట్ల పనులు చేపడుతుండటంతో కూటమి నేతలు టెండర్లపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఒక్కోపనికి సుమారుగా 10 వరకు టెండర్లు దాఖలైనట్లు సమాచారం. ఈ క్రమంలో 4న సాయంత్రం అధికారులు హడావుడిగా కొన్ని టెండర్లు తెరిచారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే శనివారం టెండర్లన్నీ రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో టెండరుదారులు అవాక్కయ్యారు.

### అనుకూల కాంట్రాక్టర్లకు టెండర్లు దక్కాలనే..!

డ్రైనేజీ శాఖలో కోట్లాది రూపాయల వ్యయంతో పనులు చేపట్టడంతో కూటమి నేతల కన్నుపడింది. వెంటనే రంగంలోకి దిగి చక్రం తిప్పడం ప్రారంభించారు. అధికారులను తమకు అనుకూలంగా వ్యవహరించేలా చర్యలు చేపట్టారు. తమకు అనుకూలమైన వారికి టెండర్లు దక్కేవరకు టెండర్ల ప్రక్రియను రద్దు చేస్తున్నారని పలువురు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే 29 పనులకు భారీగా టెండర్లు దాఖలవడంతో కూటమిలో చక్రదారులు నోరెళ్లబెట్టారు. ఎట్టి పరిస్థితుల్లో తమవారికే కాంట్రాక్టులు దక్కాలని అధికారులపై ఒత్తిడి తెచ్చి టెండర్లను రద్దు చేయించారనే వదంతి వినపిస్తోంది. కొందరు డ్రైనేజీ అధికారుల కన్నుకూడా ఈపడింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పి తమ వారికే పనులు దక్కేలా చేసుకున్నారు. నేడు కూడా అలాగే కొన్ని పనులైన దక్కించుకోవాలని ఆరాటపడుతున్నట్టు సమాచారం.

### టెక్నికల్ సమస్యతో వాయిదా వేశాం

- డ్రైనేజీ ఈఈ గోపీనాథ్

టెండర్ల ప్రక్రియలో తలెత్తిన టెక్నికల్ సమస్య కారణంగా టెండర్లను రద్దు చేయలేదని, కేవలం వాయిదా వేశామని డ్రైనేజీ ఈఈ గోపీనాథ్ తెలిపారు. త్వరలోనే తిరిగి టెండర్ల ప్రక్రియను ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## ధాన్యం.. దైన్యం

(5వ పేజీ తరువాయి)

ధాన్యాన్ని ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం తేమశాతాన్ని బట్టి బస్తా ధాన్యానికి రూ.1,470 నుంచి రూ.1,550 వరకు మద్దతు ధరగా వస్తోంది. గతంలో తేమశాతాన్ని సాకుగా చూపి రూ.1,400 నుంచి రూ.1,450కు మించి ఇవ్వలేదు. రైతుసేవా కేంద్రాలకు తీసుకెళ్లిన రైతులు నచ్చిన మిల్లుకు ధాన్యం విక్రయిస్తామనుకోగా, ఆన్‌లైన్‌లో కొన్ని మిల్లులకు అవకాశం లేకుండాపోయింది. మిల్లు యజమానులు పూర్తిస్థాయిలో బ్యాంకు గ్యారెంటీ చూపలేదని, కోరిన మిల్లులకు ధాన్యం పంపేందుకు ట్రక్‌షీట్ జనరేట్ కావడం లేదని రైతుసేవా కేంద్రాల్లోని సిబ్బంది చెబుతున్నారు. మిల్లు యజమానులతో పూర్తిస్థాయిలో బ్యాంకు గ్యారెంటీని కట్టిస్తేనే ధాన్యం కొనుగోలులో కొంతమేర ఇబ్బందులు తొలగుతాయి. మిల్లుల వద్దకు వెళ్లాక మినీమిల్లింగ్ మిషన్‌లో ధాన్యాన్ని వేసి, నూకలశాతం అధికంగా ఉంటోందని కొత్త సాకులు చెప్పి మిల్లర్లు, వ్యాపారులు ధాన్యం మద్దతు ధరలో కోత పెడుతున్నారు. నాలుగైదు రోజులుగా మంచు అధికంగా కురుస్తుండటంతో ధాన్యంలో తేమశాతం త్వరగా తగ్గని పరిస్థితి నెలకొంది.

### తేమశాతంలో తిరకాసు

కంకిపాడు మండలంలోని ధాన్యానికి బస్తాకు రూ.1,470గా ధర నిర్ణయించి శుక్ర, శనివారాల్లో ట్రక్‌షీట్లు జనరేట్ చేశారు. 20 టన్నుల ధాన్యాన్ని లారీల ద్వారా చీరాల, జగ్గయ్యపేట తదితర ప్రాంతాలకు పంపుతున్నారు. రైతులు కిరాయిగా టన్నుకు రూ.700, లారీ వెయిటింగ్ చార్జీల రూపంలో రోజుకు రూ.1,500 చొప్పున భరిస్తామని చెబితేనే వాహనాలు సమకూరుస్తున్నారు. రైతులు విక్రయించిన ధాన్యానికి పూర్తిస్థాయి మద్దతు ధర లభించినట్లుగా చూపేందుకు 20 టన్నులు కాకుండా, ధాన్యంలో తేమశాతాన్ని బట్టి 17 టన్నుల నుంచి 18 టన్నులు మాత్రమే విక్రయించినట్లుగా రికార్డుల్లో చూపుతున్నారు. అంతమేర ధాన్యం రవాణాకు సంబంధించిన కిరాయి ఇచ్చేలా నమోదు చేస్తున్నారు.

## అక్రమార్కులకు అధికారుల అండ!

- అసోసియేషన్ కార్యాలయానికి వేసిన సీల్ తొలగింపు ● ఎంపీ సూచనల మేరకే తొలగించామన్న వీఎంసీ ఎస్టేట్ ఆఫీసర్



కార్పొరేషన్ అధికారులు వేసిన సీలును తొలగించిన భవానీపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం, తాళం తీసి ఉన్న భవానీపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం

**విద్యాధరపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** పేదలు రోడ్డు పక్కన పది గజాల స్థలం ఆక్రమించుకుంటే నానా హడావుడి చేసే అధికారులు రూ.కోట్లాది విలువైన కార్పొరేషన్ స్థలంలో అనధికారికంగా అసోసియేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి అనధికారికంగా రుసుము వసూలు చేస్తున్న వారికి విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు కొమ్ముకాస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమదారులను అడ్డుకోవాల్సిన కార్పొరేషన్ అధికారులే వారికి అండగా ఉంటూ కార్పొరేషన్ ఆదాయాన్ని కొల్లగొడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భవానీపురం లారీస్టాండ్ ప్రాంగణంలో వైసీపీకి చెందిన కొందరు నేతలు అనధికారికంగా భవానీపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో అయిదేళ్ల క్రితం కార్యాలయం ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా వాహనాలు నిలిపినందుకు భారీ ఎత్తున రుసుము వసూలు చేస్తున్నారు. ఎస్టేట్ అధికారులు.. ఆక్రమణదారులతో లాలూచీ పడి వారి నుంచి ముడుపులు దండుకుంటూ పట్టించుకోవటం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. దీనిపై ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో భవానీపురం లారీస్టాండ్‌లో అక్రమ వసూళ్ల దందా పేరుతో కథనం ప్రచురణ అయింది. దీనిపై స్పందించిన మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలతో ఎస్టేట్ అధికారి శ్రీనివాసరావు అసోసియేషన్ కార్యాలయానికి తాళం వేసి సీలు వేశారు. దీంతో ఆక్రమణదారులు మళ్లీ కార్యాలయాన్ని తీయాలని గట్టి ప్రయత్నం చేశారు. అందులో భాగంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఎంపీ కేశినేని శివనాథ్, పలువురు ఎన్డీయే నేతలను కలిసి మంతనాలు చేశారు. వారు కూడా ఆక్రమణదారులను మందలించి కార్పొరేషన్‌కు రుసుం కట్టాలంటూ తేల్చిచెప్పడంతో పాటు వేరేచోట స్థలం చూసుకోమని చెప్పారు. ఈ క్రమంలో అధికార పార్టీ నేతలకు పెద్దమొత్తంలో ముడుపులు ఆశ చూపించినా ఫలించలేదు. మరోసారి వారు ఎంపీని కలిసి వేడుకోవడంతో పూర్తి వివరాలు తెలుసుకున్న ఎంపీ తాత్కాలికంగా కార్యాలయం తీసినప్పటికీ కార్పొరేషన్ నిర్ణయించిన రుసుం చెల్లించాలని, అలాగే వేరే ప్రాంతానికి తరలించేందుకు స్థలాలు చూసుకోవాలని తేల్చిచెప్పారు. కాగా వీఎంసీ కార్యాలయంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమానికి హాజరైన ఎంపీని మళ్లీ పలువురు ఆక్రమణదారులు కలిసి అసోసియేషన్ కార్యాలయాన్ని ఓపెన్ చేయించాలని వేడుకున్నారు. దీంతో ఆయన కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి అసోసియేషన్ కార్యాలయానికి వేసిన సీలును తొలగించమని ఎస్టేట్ విభాగం అధికారి శ్రీనివాస్‌కు సూచించినట్టు తెలిసింది. దీంతో కార్యాలయానికి వేసిన సీలును తొలగించారు.

### ఎంపీ సూచనల మేరకే సీలు తొలగించాం

**శ్రీనివాసరావు, వీఎంసీ ఎస్టేట్ విభాగం అధికారి**

లారీ స్టాండ్ ప్రాంగణంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన భవానీపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయానికి వేసిన సీలును విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) సూచనల మేరకే తొలగించాం. కార్యాలయాన్ని పూర్తిగా తొలగించాలని ఎంపీని కోరాం.

## విజయమ్మకు వైసీపీ పగ్గాలివ్వమని విజయసాయి సలహా ఇవ్వాలి: వాసిరెడ్డి

**వన్‌టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** ముఖ్యమంత్రిని మార్చాలని సలహా ఇస్తున్న విజయసాయి రెడ్డి ముందు తన పార్టీని చక్కదిద్దుకోవటానికి విజయమ్మకు వైసీపీ పగ్గాలు అప్పగించాలంటూ జగన్‌కు సలహా ఇవ్వాలని వాసిరెడ్డి పద్మ అన్నారు. శనివారం నగరంలో విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి డైరెక్షన్‌లో విజయసాయిరెడ్డి చిల్లర రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారన్నారు. ఇతర పార్టీలకు సలహా ఇచ్చే ముందు ప్రజా నమ్మకం కోల్పోయిన జగన్ పార్టీ బాధ్యతల నుంచి తప్పుకుని విజయమ్మకు పార్టీ పగ్గాలు అప్పచెప్పాలని విజయసాయిరెడ్డి జగన్‌కు సలహా ఇస్తే బాగుంటుందన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రతి స్కీమ్ వెనుక పెద్ద స్కామ్ నడిపినట్లు ఆధారాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. వీటిపై మాట్లాడే శక్తి లేని విజయసాయిరెడ్డి ముఖ్యమంత్రి పదవిని వివాదం చేయటానికి అత్యుత్సాహం చూపుతున్నాడన్నారు.

## కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- పేరెంట్స్, టీచర్స్ మీట్‌లో ఎంపీ కేశినేని శివనాథ్

**పటమట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిలబెడతామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. పటమటలంకలోని కొమ్మా సీతారామయ్య జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు స్థాయి పెంచేలా సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని, అందుకోసమే తన సొంత నిధులతో ఎన్టీఆర్ జిల్లాలో 147 ప్రభుత్వ పాఠశాలలో క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు సూచనలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు 8 క్రీడలకు సంబంధించిన స్పోర్ట్సు కిట్లను త్వరలోనే అందజేయనున్నట్టు వివరించారు. క్రీడా ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు క్రిస్మస్ నుంచి సంక్రాంతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉన్నవారు పాఠశాలల అభివృద్ధికి ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. డీఈవో సుబ్బారావు, హెచ్ఎం మురళీకృష్ణ, జిల్లా వైద్యాధికారి సుహాసిని, పాఠశాల సెక్రటరీ రాజ్యలక్ష్మితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు





వేర్వేరు సదస్సుల్లో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ

### ప్రభుత్వ బడుల్లో ఉన్నత విద్యా ప్రమాణాలు: కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ రూరల్:** ప్రభుత్వ బడుల్లో ఉన్నతస్థాయి ప్రమాణాలతో విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని, ఇకపై ప్రభుత్వ బడుల విద్యార్థులు అద్భుతాలు సాధిస్తారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామ హైస్కూల్‌లో శనివారం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ జరిగింది. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యాబోధనలో మౌలిక సదుపాయాలు, భోజన పథకం గురించి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల రెడ్డి, రూరల్ మండల తహసీల్దార్ బి. సుగుణ పాల్గొన్నారు.



షష్టి సందర్భంగా దుర్గగుడిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణంలో స్వామివారికి, అమ్మవార్లకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

## దుర్గగుడిలో వల్లీ, దేవసేన, సుబ్రహ్మణ్య కల్యాణం

**వన్‌టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** మార్గశిర శుద్ధ షష్టి తిథిని పురస్కరించుకుని మాసవారీ కార్యక్రమంగా శనివారం దుర్గగుడిలో వల్లీ-దేవసేన-సుబ్రహ్మణ్యం కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా, వేదవిహితంగా నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో ఉపాలయంగా ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలోని ఉత్సవ మూర్తులను పెళ్లి కుమారుడు, పెళ్లికుమార్తెలుగా అలంకరించి తరువాత వేదికపై వివిధ ఉపచారాలు నిర్వహించి, వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణ ప్రక్రియను అర్చకులు నిర్వహించారు. భక్తులు పాల్గొని కళ్యాణోత్సవాన్ని తిలకించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈవో రామారావు, ఇంకా పలువురు పాల్గొన్నారు.



కృష్ణవేణి సంగీత నీరాజనంలో కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

## వీనుల విందుగా పంచరత్న కీర్తనలు

- దుర్గాఘాట్‌లో కృష్ణవేణి సంగీత నీరాజనం

**వన్‌టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** కృష్ణవేణి సంగీత నీరాజనం ఉత్సవం శనివారం దుర్గాఘాట్‌లో ప్రారంభమైంది. సీనియర్ సంగీతజ్ఞులు మల్లాది సూరిబాబు, మల్లాది శ్రీరాంప్రసాద్, మల్లాది రవికుమార్, మోదుమూడి సుధాకర్, కోపూరి గౌరినాధ్, కోపూరి గాయత్రి, విష్ణుబొట్ల కృష్ణవేణి, మొల్లాది కార్తీక త్రివేణి, నరసమ్మ, తదితర బృందం, మృదంగ విద్వాంసులు, వయోలిన్ విద్వాంసులు పాల్గొన్నారు. తమ అద్భుత గాత్రంతో పంచరత్న కీర్తనలను హృద్యంగా ఆలపించారు. వారి గాత్ర మధురిమలతో కృష్ణాతీరం ఆనంద సాగరంలో తేలియాడింది. అక్కడ గానామృత సహిత సుగంధ కలువలు విరబూశాయి. సుమారు 25మందికి పైగా త్యాగరాజ పంచరత్న కీర్తనలను తమదైన శైలిలో పాడి అలరించారు. కర్ణాటక సంగీత గానామృతం వివిధ రాగాల్లో, పల్లవుల్లో ప్రవహించింది. దుర్గగుడి ఈవో రామారావు పరిచయ వ్యాఖ్యలు చేస్తూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతను వివరించారు. చక్కని వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమం అందరి హృదయాలను హత్తుకుంటుందన్నారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు తొలుత దుర్గగుడికి వెళ్లి అక్కడ దేవీ కృతులను ఆలపించి, దుర్గాదేవికి గాన నీరాజనం సమర్పించి, మళ్లీ మహోత్సవంలో భాగంగా కీర్తనలను ఆలపించనున్నారు. ఈ కృష్ణవేణి సంగీత నీరాజన ఉత్సవం భారతదేశ వైవిధ్య సాంస్కృతిక వారసత్వానికి ఘనమైన వేదికని సంప్రదాయ కళల అభివృద్ధికి దోహదం చేస్తుందని పర్యాటక మంత్రిత్వ శాఖ తెలిపింది.

### అమరావతి ఐఆర్ఆర్ ల్యాండ్ ప్రొక్యూర్‌మెంట్ ఆర్ఎఫ్‌పీ గడువు పొడిగింపు

**విజయవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్)కు సంబంధించి ల్యాండ్ ప్రొక్యూర్‌మెంట్ మంచి మోడల్‌ను ఇచ్చేందుకు వీలుగా ఆర్ఎఫ్‌పీ విడుదల చేసిన సీఆర్‌డీఏ అధికారులు మరోమారు గడువును పెంచారు. బిడ్డర్ల నుంచి సాంకేతికపరమైన అంశాలపై సందేహాలు వ్యక్తమైన నేపథ్యంలో గడువును డిసెంబరు 20 వరకు పొడిగించారు.

## రేపు ఎన్టీఆర్ వర్సిటీ అథ్లెట్స్ టీమ్‌ల ఎంపిక

**విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఆధ్వర్యంలో పురుషుల, మహిళా అథ్లెట్ టీమ్‌ల ఎంపికలను ఈ నెల 9న ఉదయం 9 గంటలకు చినకాకానీ ఎన్ఆర్ఐ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు వర్సిటీ స్పోర్ట్సుబోర్డు సెక్రటరీ ఈ త్రిమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని భువనేశ్వర్‌లోని కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో ఈ నెల 26 నుంచి 30 వరకు జరిగే ఆలిండియా వర్సిటీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు పంపుతామన్నారు. మెడికల్ కళాశాలలు, డెంటల్, ఆయుర్వేదిక్, హోమియోపతి, యునాని కాలేజీలు, బీఎన్‌వైఎ, ఫిజియోథెరపీ వంటి అనుబంధ కాలేజీలు ఎన్టీఆర్ వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్‌కు ఆ రోజు ఎన్ఆర్ఐ కళాశాలలో రిపోర్టు చేయాలని త్రిమూర్తి పేర్కొన్నారు.

# దివి పల్లెల్లో రోడ్ల పండుగ

ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి కానరాక కునారిల్లిన దివి పల్లెల్లో నేడు రోడ్ల పండుగొచ్చింది. నిన్నమొన్నటి వరకు బురదకయ్యలుగా నడిచేందుకూ వీలులేని అవనిగడ్డ నియోజకవర్గంలోని పల్లెల్లో నేడు సీసీ రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది.

- అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.30.68 కోట్లతో శరవేగంగా నిర్మితమవుతున్న 496 సీసీ రోడ్లు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామీణ ప్రజలు



ఘంటసాలపాలెంలో సీసీ రహదారి నిర్మాణం (నేడు)



ఘంటసాలపాలెంలో అధ్వానంగా ఉన్న రహదారి (నాడు)

**(ఆంధ్రజ్యోతి - అవనిగడ్డ బృందం)**

రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యంగా వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాలను అభివృద్ధి చేయాలని తలచింది. అందులో భాగంగా పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలు పేరుతో గ్రామసభలు నిర్వహించింది. అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.30.68 కోట్లతో 48.730 కిలోమీటర్ల పొడవున 496 సీసీ రహదారుల నిర్మాణానికి వెనువెంటనే పనులు ప్రారంభించింది. గ్రామసభల నిర్వహణ, పనుల ఆమోదం, అంచనాల తయారీ, నిధుల విడుదల, గ్రామాల్లో పనులు మొదలు కావటం ఒక దాని వెంట ఒకటి వెనువెంటనే జరగడంతో పల్లెల్లో ప్రజలు ప్రభుత్వ పనితీరుపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### అవనిగడ్డ మండలంలో రూ.6.25 కోట్లతో 117 రోడ్లు

అవనిగడ్డ మండలంలో రూ.5.49 కోట్లతో 9,061 మీటర్ల మేర 104 సీసీ రహదారులు నిర్మితమవుతున్నాయి. వీటికి అదనంగా రూ.76.20 లక్షలతో మరో 1270 మీటర్ల రహదారులకు నిధులు మంజూరయ్యాయి. 13 రహదారులను అదనంగా నిర్మిస్తున్నారు. అవనిగడ్డ మండలంలో మొత్తం రూ.6.25 కోట్లతో 117 సీసీ రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. లంకమ్మ మాన్యం, రాజశేఖరపురం కాలనీల్లో నిన్నటి వరకు బురద రహదారులపై నడిచిన ప్రజలు ఇప్పుడు కొత్త సీసీ రహదారులను చూసి సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

### మోపిదేవి మండలంలో రూ.5.63 కోట్లతో 86 రోడ్లు

మోపిదేవి మండలంలో రూ.4.73 కోట్లతో 79 సీసీ రహదారులు తొలుత మంజూరయ్యాయి. మరో రూ.90 లక్షలు మంజూరు కావటంతో మొత్తం రూ.5.63 కోట్లతో 8,899 మీటర్ల మేర 86 సీసీ రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వెంకటాపురం బీసీ కాలనీలో సీసీ రహదారి వేయడంతో బురదలో తిరిగే బాధ తప్పిందని అక్కడి ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికే మండలంలో 36 సీసీ రహదారుల నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

### చల్లపల్లి మండలంలో రూ.5.5 కోట్లతో 90 రోడ్లు

చల్లపల్లి మండలంలో రూ.3.96 కోట్లు తొలివిడతగా, మరో రూ.1.8 కోట్లు రెండో విడతగా మంజూరయ్యాయి. మొత్తం రూ.5.5 కోట్లతో 8,943 కిలోమీటర్ల పొడవున 90 సీసీ రహదారుల పనులు సాగుతున్నాయి. ఇప్పటివరకు 11 రహదారుల పనులు పూర్తయ్యాయి. నిన్నమొన్నటి వరకు నడిచేందుకు వీలు లేని చల్లపల్లి గౌడపాలెంలోని బండ్రేవు కోడు పక్కన రహదారిపై నేడు వాహనాల్లో రాకపోకలు సాగిస్తున్నామని అక్కడి ప్రజలు సంతోషంగా చెబుతున్నారు.

### కోడూరు మండలంలో రూ.4.47 కోట్లతో 68 రోడ్లు

తీర ప్రాంత మండలం కోడూరులో రెండు విడతల్లో మొత్తం రూ.4.47 కోట్లు మంజూరు కాగా, 6,861 మీటర్ల మేర 68 సీసీ రహదారుల నిర్మాణపనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటివరకు 20 రోడ్ల నిర్మాణం పూర్తయింది. కోడూరు శివారు యర్రారెడ్డిపాలెంలో నిర్మించిన సీసీ రహదారి గ్రామంలో రాకపోకలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అక్కడి ప్రజలు ఆనందంతో చెబుతున్నారు.

### నాగాయలంక మండలంలో రూ.5.11 కోట్లతో 81 రోడ్లు

తీర ప్రాంత మండలం నాగాయలంకలో రెండు విడతల్లో మొత్తం రూ.5.11 కోట్లు మంజూరు కాగా, 8361 కిలోమీటర్ల పొడవున 81 సీసీ రహదారులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 25 రోడ్ల నిర్మాణం పూర్తయింది. నాగాయలంక సంత మార్కెట్ పక్కన పల్లెపాలెం వెళ్లే రహదారి నిర్మించడంతో ప్రజలు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

### ఘంటసాల మండలంలో రూ.3.7 కోట్లతో 54 రోడ్లు

ఘంటసాల మండలంలో రెండు విడతల్లో మొత్తం రూ.3.7 కోట్లు 5,335 మీటర్ల పొడవునా 54 సీసీ రహదారుల పనులకు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 24 రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఘంటసాలపాలెంలో ఇంతకాలం తాము బురదలో తిరిగామని, నేడు సీసీ రహదారి నిర్మాణం పూర్తి కావొస్తోందని అక్కడి ప్రజలు చెబుతున్నారు.

### మొన్నటిదాకా మోకాలిలోతు నీళ్లలో తిరిగాం



రాజశేఖరపురం కాలనీకి వచ్చి పదేళ్లు దాటిపోయింది. రహదారి సౌకర్యం లేక మోకాటి లోతు నీటిలో బురదలో తిరిగాం. ఇంత లోతున ఉన్న ఈ రోడ్డు వేస్తారని అనుకోలేదు. కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మించింది. ఇప్పుడు పిల్లలు సైకిళ్లు, మోటార్ సైకిళ్లపై తిరుగుతున్నారు. **- అర్జా లక్ష్మి, రాజశేఖరపురం**

### ఐదేళ్ల తర్వాత అభివృద్ధి చూస్తున్నా



గడిచిన ఐదేళ్లలో ఎన్నోసార్లు నేను పుట్టిన ఈ ప్రాంతానికి వచ్చాను. గ్రామాల్లో అభివృద్ధి జాడ కనిపించేది కాదు. 2014 నుంచి 2019 వరకు 33,000 కిలోమీటర్లు మేర పల్లెల్లో సీసీ రహదారులు వేశారు. ఇది దేశంలోనే అత్యధికం. మళ్లీ చంద్రబాబు వస్తేనే పల్లెలు మారతాయి అనుకున్నాం. ఆయనకు పవన్‌కల్యాణ్ తోడయ్యారు. ఐదేళ్ల తర్వాత మళ్లీ పల్లెల్లో అభివృద్ధి చూస్తు న్నా. అవనిగడ్డ నియోజకవర్గంలో తొలివిడతగా 496 రోడ్లు మంజూరై, వాటి పనులు వేగంగా సాగడం చాలా సంతోషాన్నిస్తోంది.
**-బొబ్బా గోవర్ధన్, ఎన్ఆర్ఐ**



కోడూరు మండలం లింగారెడ్డిపాలెంలో అధ్వానపు రహదారి(నాడు), లింగారెడ్డిపాలెంలో సీసీరహదారి నిర్మాణం (నేడు)

---

## మండల పరిషత్ నిధులు స్వాహా

» షాపింగ్ కాంపెక్సు అద్దెలు కైంకర్యం చేసిన అధికారి



లక్షలాది రూపాయల మండల పరిషత్ నిధులను ఒక అధికారి దుర్వినియోగం చేశాడు. మండల పరిషత్ ఆధీనంలోని షాపింగ్ కాంప్లెక్సుల అద్దెలు వసూలు చేసిన అధికారి సొమ్మును మండల పరిషత్‌కు జమ చేయకుండ స్వాహా చేశాడు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఆ అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటుగా క్రిమినల్ కేసు నమోదు చేయాల్సిన జిల్లా ఉన్నతాధికారులు కైంకర్యం చేసిన సొమ్మును జమ చేయాల్సిందిగా బతిమాలుతుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది.

**కంచికచర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** కంచికచర్ల మండల పరిషత్‌కు కాకాని వెంకటరత్నం(కేవీఆర్) పేరుతో, నందమూరి తారకరామారావు(ఎన్టీఆర్) పేరుతో రెండు షాపింగ్ కాంప్లెక్సులున్నాయి. కేవీఆర్ కాంప్లెక్సులో 20 దుకాణాలు ఉండగా, ఎన్టీఆర్ కాంప్లెక్సులో ఎనిమిది దుకాణాలు ఉన్నాయి. దుకాణాదారులు కొద్దినెలల క్రితం వరకు ప్రతినెల అద్దెను మండల పరిషత్ కార్యాలయంలో చెల్లించి, రశీదు తీసుకునే వారు. అద్దెలకు సంబంధించి దుకాణాదారుల నుంచి వసూలైన సొమ్మును మరుసటి నెలలో తప్పనిసరిగా మండల పరిషత్ సాధారణ నిధులకు జమ చేయాలి. అయితే 2023లో జూన్, జూలై, సెప్టెంబరు, అక్టోబరు నెలలకు వసూలైన అద్దెల సొమ్ము మండల పరిషత్ సాధారణ నిధులకు జమ కాలేదు. జూన్‌లో రూ.77,301, జూలైలో రూ.77,647, సెప్టెంబరులో రూ. 77,361, అక్టోబరులో రూ.59,219 మొత్తం రూ.2,91,528 మండల పరిషత్‌కు జమ కాలేదు. ప్రతి నెలా అద్దెలు వసూలు చేసిన అధికారి, సొమ్ములు అందినట్టుగా దుకాణాదారులకు రశీదులు ఇచ్చాడు. ఆ సొమ్మును మండల పరిషత్ సాధారణ నిధులకు జమ చేయకుండా కైంకర్యం చేశాడని ఆరోపణలున్నాయి. కొద్ది నెలల క్రితం వరకు ఆ అధికారి, మండల పరిషత్‌లో పెత్తనం చెలాయించడంతో అద్దె సొమ్ము దుర్వినియోగం వ్యవహారం ఎవరికీ తెలియదు. దీనికితోడు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి దుకాణదారులు బ్యాంకు చలానా ద్వారా అద్దెలు చెల్లిస్తున్నారు. ఆ తర్వాత ఈవిషయం తెలిసినప్పటికీ బయటకు పొక్కకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. మండల పరిషత్ అధికారులు, జిల్లా అధికారులకు తెలియజేసినట్టుగా తెలిసింది. సాధారణ నిధులకు జమ చేయాల్సిన అద్దె సొమ్ము రూ. 2,91,528 తక్షణమే జమ చేయాలని కొద్ది రోజుల క్రితం ఆ అధికారికి ఎంపీడీవో నోటీసు ఇచ్చారు. కానీ, అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సొమ్ము జమ చేయాలని కోరడం పలు అనుమానాలకు తావిస్తోంది.


### అధికారికి నోటీసు ఇచ్చాం

షాపింగ్ కాంప్లెక్సుల దుకాణాలకు సంబంధించిన అద్దె సొమ్ము కొంత మొత్తం మండల పరిషత్ సాధారణ నిధులకు జమ కాలేదు. అద్దె సొమ్ము జమ చేయకపోవడాన్ని జిల్లా పరిషత్ సీఈవో దృష్టికి తీసుకెళ్లాం. ఇందుకు బాధ్యుడైన ఆ అధికారికి ఇప్పటికే నోటీసు ఇచ్చాం.
**-బీఎం లక్ష్మీకుమారి, ఎంపీడీవో**

## కల్యాణం.. కమనీయం

### కన్నులపండువగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం

**మోపిదేవి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం శనివారం కన్నులపండువగా జరిగింది. మార్గశిర షష్ఠి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామికి ప్రాతఃకాలార్చనలు, గోపూజ, నిత్యహోమం, బలిహరణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. స్వామి, అమ్మవార్లను విశేష అలంకరణ చేసిన శేషవాహనంపై ఆశీనులు గావించి కల్యాణ మహోత్సవాన్ని అర్చక బృందం నిర్వహించారు. దేవదాయశాఖ, చల్లపల్లి రాజవంశీయుల తరఫున నూతన పట్టువస్త్రాలను ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు సమర్పించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ గావించగా, వందల మంది దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ప్రధాన అర్చకుడు బుద్ధు పవన్ కుమార శర్మ ఆధ్వర్యంలో కల్యాణ ఘట్టం ప్రారంభించారు. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తుల జయజయ ధ్వానాల నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపించారు. మంగళసూత్రాలు భక్తులకు ప్రదర్శించి, మంగళధారణ కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాఅన్నసమారాధనను ఆలయ ఈవో పర్యవేక్షించారు. మోపిదేవి కేడీసీసీ బ్రాంచ్, మండలంలోని పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 3 వేల వాటర్ బాటిళ్లు, 1500 మజ్జిగ ప్యాకెట్లను బ్రాంచ్ మేనేజర్ సల్మానా భక్తులకు అందజేశారు. మచిలీపట్నం ఆర్డీవో ఎం.స్వాతి కుటుంబసమేతంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. షష్ఠి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఆర్డీవో దంపతులను ఆలయ అర్చకులు శేషవస్త్రంతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.



మంగళసూత్రాలు భక్తులకు ప్రదర్శిస్తున్న అర్చకులు



మయూరవాహనంపై ఊరేగుతున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

### వైభవంగా గ్రామోత్సవం

**మోపిదేవి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి కల్యాణమహోత్సవాలలో బాగంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. ఉదయం స్వామి దివ్య కల్యాణ మహోత్సవం అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మయూర వాహనంపై స్వామిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పసుపు, కుంకుమలు కొబ్బరికాయలు సమర్పించి స్వామిని దర్శించుకున్నారు.

## మచిలీపట్నంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ కేంద్రం ప్రారంభిస్తాం

» ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం పెడతాం

» బందరులో 2,3 తేదీల్లో యువకెరటాలు నిర్వహిస్తాం

» పేరెంట్స్-టీచర్స్ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర




రుస్తుంబాద మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో పేరెంట్స్-టీచర్స్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** ఆంధ్ర జాతీయ కళాశాలలో గ్లోబల్ ఎడ్యుకేషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తామని, మచిలీపట్నానికి విద్యారంగంలో పూర్వ వైభవం తెస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రుస్తుంబాద మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో డీఈవో రామారావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన పేరెంట్స్-టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, మునిసిపల్, జిల్లాపరిషత్ పాఠశాలలను బలోపేతం చేసేందుకు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చక్కటి ప్రణాళిక రూపొందించారన్నారు. 'ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెడతాం. మచిలీపట్నం పాలిటెక్నిక్ కళాశాలకు శాశ్వత భవనం నిర్మిస్తాం. 2025 జనవరి 2,3 తేదీల్లో మచిలీపట్నంలో యువకెరటాలు కార్యక్రమం నిర్వహిస్తాం. విద్యాసంస్థల్లో గంజాయి, డ్రగ్స్ అరికట్టేందుకు ఈగల్ పవర్‌ను వినియోగిస్తున్నాం.' అని మంత్రి తెలిపారు. విద్యార్థినుల తల్లులు వేసిన ముగ్గులను తిలకించారు. టగ్ ఆఫ్ వార్ పోటీలో పాల్గొన్నారు. విద్యార్థులు గీసిన బొమ్మలు, చిత్రాలను తిలకించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేపీ నాయకుడు సోడిశెట్టి బాలాజీ, పేరెంట్స్‌టీచర్స్ కమిటీ చైర్మన్ ఆదిలక్ష్మి, ఎంఈవో దుర్గాప్రసాద్, హెచ్ఎం కృష్ణమూర్తి పాల్గొన్నారు.



గన్నవరం విమానాశ్రయంలో కేంద్ర మంత్రి ఖట్టర్‌కు వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేసి స్వాగతం పలుకుతున్న ఎంపీ కేశినేని చిన్ని

### కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ఘనస్వాగతం

**గన్నవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ఈఈఎస్ఎల్ సహకారంతో రాష్ట్రంలో నిర్వహించిన ఊర్జావీర్ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు శనివారం విమానాశ్రయానికి విచ్చేసిన ఖట్టర్‌కు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఇంధనశాఖ రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ పూలబొకే అందజేసి స్వాగతం పలికారు. ఎంపీ చిన్ని తిరుమల తిరుపతి ప్రసాదం, వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు. బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి రోడ్డుమార్గాన విజయవాడ వెళ్లారు.

### రూ.రెండున్నర కోట్లతో తిరుపతమ్మ దేవస్థానంలో అభివృద్ధి పనులు

**పెనుగంచిప్రోలు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** తిరుపతమ్మ దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం రూ.2.5 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేసేందుకు దేవదాయ శాఖ కమిషనర్ ఆమోదానికి పంపుతూ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. శనివారం అమ్మవారి దేవస్థానం వద్ద ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు అధ్యక్షతన పాలకమండలి సమావేశం నిర్వహించారు. పలు అర్జిత సేవలు నూతనంగా ప్రవేశపెట్టేందుకు కమిషనర్ ఆమోదానికి పంపారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ బీహెచ్‌వీఎస్ కిషోర్‌కుమార్, ధర్మకర్తలమండలి సభ్యులు పాల్గొన్నారు.



తన కుమారుడితో పతాకనిధికి విరాళం అందిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

## పతాకనిధికి విరివిగా విరాళాలిద్దాం

» వీరజవాన్ల కుటుంబాలకు అండగా నిలుద్దాం

» ప్రజలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపు

**కృష్ణలంక, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** దేశరక్షణ కోసం ప్రాణాలర్పించిన వీర సైనికుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, సాయుధ దళాల పతాకనిధికి విరివిగా విరాళాలు అందించేందుకు ముందుకు రావాలని ప్రజలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని(ఫ్లాగ్ డే) పురస్కరించుకుని శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తన కుమారుడితో కలిసి సాయుధ దళాల పతాకనిధికి ఆయన విరాళం అందించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి నుంచి పతకాన్ని అందుకున్నారు. పతాకనిధికి అందించే విరాళాలకు 80(జీ)(5)(6) ఆఫ్ ఇన్‌కంటాక్స్ యాక్ట్ 1961 ద్వారా ఆదాయ పన్ను రాయితీ లభిస్తుందని జిల్లా సైనిక సంక్షేమ అధికారి సర్జన్ లెఫ్టినెంట్ కమాండర్ కె.కల్యాణవీణ తెలిపారు. స్వచ్ఛందంగా విరాళాలు అందించేందుకు ముందుకు వచ్చే వారు జిల్లా సైనిక సంక్షేమ అధికారి, ఎన్టీఆర్ జిల్లా అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా నెం.62067742138, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0020899 ద్వారా నేరుగా తమ విరాళాలను అందించవచ్చని ఆమె తెలిపారు. మాజీ సైనికులు, సైనిక సంక్షేమ కమిటీ సభ్యులు, దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల, సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.




ఈ-కామర్స్ సంస్థల ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంటున్న మెప్మా డైరెక్టర్ తేజ్‌భరత్

### ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందాలు

**మొగల్రాజపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** స్వయం సహాయక సంఘాల(ఎసెహెచ్‌జీ) ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) డైరెక్టర్ తేజ్‌భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. గాయత్రీనగర్‌లో శనివారం ఈ-కామర్స్ సంస్థలు ఏపీటీపీసీ, ఓఎన్‌డీసీ, మై స్టోర్, హోమ్ ట్రయాంగిల్‌తో మెప్మా వర్క్‌షాపు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్త రావాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ పర్యవేక్షణలో స్వయం సహాయ సంఘాలను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా 123 మున్సిపాలిటీల్లో 28,77,109 మంది పేద, నిరుపేద మహిళను సమీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అత్యున్నత స్థాయిలో వ్యాపారం చేస్తున్న సొసైటీ సభ్యులను గుర్తించి అధికారుల సమన్వయంతో పరిశ్రమలు ప్రారంభించేలా చూస్తామన్నారు. గృహ అవసరాలకు సంబంధించిన సేవలను వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా సులభంగా గుర్తించడానికి హోమ్ ట్రయాంగిల్ సంస్థ ఉపయోగపడుతుందన్నారు. ఏపీటీపీసీ ప్రతినిధి శ్రీవల్లి, ఓఎన్‌డీసీ మైస్టోర్ ప్రతినిధి బ్లెస్సీనందం, హోమ్ ట్రయాంగిల్ ప్రతినిధి భూమిక, ఎంఎస్ఎంఈ నుంచి రవి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఉషాకిరణ్, రాష్ట్ర మిషన్ మేనేజర్లు శ్రీనివాసులు, సాంకేతికనిపుణులు ప్రభావతి పాల్గొన్నారు.




ఫిబ్రవరి 8న నిర్వహించే లైవ్ షో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సింగర్ శ్రీరామ్, వేగా జ్యూవెల్లర్స్ అధినేత నవీన్

## సింగర్ సిద్ శ్రీరామ్ లైవ్ షో

**లబ్బీపేట, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి):** ప్రముఖ సింగర్ సిద్ శ్రీరామ్ లైవ్ పర్ఫామెన్స్ షోను ఫిబ్రవరి 8వ తేదీన విజయవాడలో వేగా జ్యూవెలర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధినేత నవీన్ తెలిపారు. బందర్‌రోడ్డులోని ఓ హోటల్‌లో శనివారం లైవ్ షో బ్రోచర్ అవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లైవ్ షో కోసం సంవత్సరం నుంచి శ్రేయస్ మీడియా ద్వారా ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. లైవ్ షోలో నగరవాసులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. తాను తమిళం అయినా తెలుగులోనే హిట్స్ ఉన్నాయని, నువ్వుంటే నా జతగా సాంగ్ తన ఫేవరేట్ అని సింగర్ శ్రీరామ్ తెలిపారు. మ్యూజిక్ తన లైఫ్ అని, రామనుజం తన గురువని, 2019లో కర్ణాటకలో లైవ్ కాన్సెప్ట్ చేశానని ఆయన తెలిపారు. రొమాంటిక్ సాంగ్స్ చాలా పాడానని జానపద పాటలు ఎక్కువగా పాడాలని కోరుకుంటున్నానని ఆయన తెలిపారు. తనతో లైవ్ షో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్న వేగా జ్యూయలర్స్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. విజయవాడతో తనకు ఎంతో అనుబంధం ఉందని అందుకే ఈ లైవ్ షో చేస్తున్నట్లు తెలిపారు. శ్రేయస్ లైవ్ ఈవెంట్ ప్రతినిధి విపున్ తదితరులు పాల్గొన్నారు.

### అందుబాటులో పట్టభద్రుల ఎమ్మెల్సీ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలు

**కృష్ణలంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** శాసనమండలిలోని కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి చెందిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను నవంబరు 23న గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించామని గుంటూరు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి తరఫున షేక్ ఖాజావలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 6 వరకు వచ్చిన క్లయిమ్‌లను విచారించి అర్హత కల్గిన అర్జీదారులను డ్రాఫ్ట్ జాబితా నందు ఓటర్లుగా చేర్చామని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల నమోదు అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి గుంటూరు, కృష్ణా, గుంటూరు నియోజకవర్గంలోని అన్ని జిల్లాల్లోని తహసీల్దార్ కార్యాలయంలో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజలు జాబితాను పరిశీలించుకుని అభ్యంతరాలను ఫాం 7, సవరణకు ఫాం 8, ఓటు నమోదుకు ఫాం 18తో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల స్వీకరణకు డిసెంబరు 9 చివరి తేదీ అన్నారు. 2021 నవంబరు 1లోపు డిగ్రీ పొంది ఓటరు లిస్టులో నమోదవని వారు వినియోగించుకోవాలని సూచించారు.

## ముడాతో అభివృద్ధి : మట్టా

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ముడా కార్యక్రమంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ అన్నారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు తదితరులు శనివారం ముడా చైర్మన్ మట్టా ప్రసాద్‌ను సత్కరించారు. ముడా పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.





ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రాధాకృష్ణమూర్తి దంపతులు, నాగపుట్టలో పాలు పోస్తున్న భక్తులు

### బ్రాయిలర్ ధరలు

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 101, 109, 120 |
| చికెన్ విత్ స్కిన్ | 194 |
| చికెన్ స్కిన్‌లెస్ | 204 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.620

## ఘంటసాలలో వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి

ఘంటసాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా స్వామి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామ ప్రముఖులు ఘంటసాల రాధాకృష్ణమూర్తి - విజయలక్ష్మి దంపతులచే వేదపండితులు చావలి కృష్ణకిషోర్ బృందం కల్యాణ మూర్తులకు ప్రత్యేక పూజలు జరిపించారు. రాత్రి గం.8.09 నిముషాలకు స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణ వేడుకను తిలకించారు. తొలుత ఎదుర్కోలు వేడుకను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, గొర్రెపాటి జగన్మోహనరావు, గొర్రెపాటి సురేంద్ర పర్యవేక్షించారు. కాగా, షష్ఠి వేడుకలకు భక్తులు పోటెత్తారు. పుట్టలో పాలుపోసి భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాపవినాశనం గ్రామానికి చెందిన మురళీకృష్ణ భక్తి సమాజం తాళం భజన నిర్వహించారు. కొండిపర్రు వాస్తవ్యులచే మురళీ కోలాటం నిర్వహించారు.

## పృథ్వీశ్వరస్వామి సేవలో మాజీ మంత్రి పేర్ని నాని

చల్లపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నడకుదురు పృథ్వీశ్వర స్వామి క్షేత్రాన్ని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు.

నాని దంపతులు, కుమారుడు పేర్ని కిట్టు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వారిని సత్కరించారు. నడకుదురు సర్పంచ్ గొరిపర్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### బ్రాయిలర్ ధరలు

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 101, 109, 120 |
| చికెన్ విత్ స్కిన్ | 194 |
| చికెన్ స్కిన్‌లెస్ | 204 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.620

## పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేత

గుడ్లవల్లేరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వెణుతురుమిల్లి ప్రాథమిక పాఠశాలకు గుడ్లవల్లేరు గ్రామానికి చెందిన కొల్లిపర పార్థసారథి అనసూయ దంపతులచే పలు ఉపకరణాలు ఉచితంగా అందచేశారు. మైక్, సౌండ్‌సిస్టం, స్టీలు వాటర్ డ్రమ్ లను శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణలక్ష్మి కి అందచేశారు. కార్యక్ర మంలో డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం నేడు

గుడ్లవల్లేరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : లయన్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మధుమేహవ్యాధి చికిత్సా శిబిరం నిర్వహించనున్నామని శిబిర కో-ఆర్డినేటర్ మూల్పూరి సుధాకర్ తెలిపారు. డాక్టర్ రజనీచే వైద్యపరీక్షలు నిర్వహిస్తారని లయన్ సేవాభవన్‌లో ఈ ఉచిత చికిత్సా శిబిరం నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల




జమీగోల్వేపల్లి జడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల



మాట్లాడుతున్న రావి వెంకటేశ్వరరావు



మేడూరు జడ్పీ స్కూల్‌లో మాట్లాడుతున్న గుమ్మడి గోపాలకృష్ణ



మొవ్వలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంఈవో శ్రీలక్ష్మి

# పండుగలా మెగా పేరెంట్స్ డే

గుడివాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక ఏకేటీపీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు, తన సోదరీమణులైన చేకూరు రజిని, పెద్దు ఝాన్సీలను పరిచయం చేశారు. వికసిత్ ఆంధ్ర 2047లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను, నోటు పుస్తకాలను అందజేశారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఎంఈవో బాలాజీ, మున్సిపల్ మాజీ చైర్మన్ గుదే లక్ష్మీరంగ నాయకమ్మ, విద్యాకమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్థానిక ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఆయన వెంట ఎన్‌టీఆర్ స్టేడియం ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, విద్యాకమిటీ సభ్యులు, పాల్గొన్నారు. స్థానిక ఎస్‌పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ హాజరయ్యారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. గౌరీశంకరపురంలోని మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మహిళ సంఘం అధ్యక్షులు వల్లూరుపల్లి లక్ష్మీ, కోశాధికారి కె.ఝాన్సీ, కరస్పాండెంట్ పి.వి రమాదేవిలు పాల్గొని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పెద ఎరుకపాడులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పి.మరియదాసు అధ్యక్షతన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్మికనగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గూడసాటి నిర్మలరాణి అధ్యక్షతన ఆత్మీయ సమావేశం జరిగింది.

**గుడివాడ రూరల్** : మోటూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 1000 మందికిపైగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మోటూరు గ్రామ ప్రముఖుల ఆధ్వర్యంలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్ వివిధ రకాల పోటీలు నిర్వహించారు. విద్యార్థుల, వారి తల్లిదండ్రుల అనుభవాలు పంచుకున్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ సంజీవని దేవి, స్కూల్ చైర్మన్ అనిల్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ హాజరయ్యారు. మోటూరు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పి.వెంకటేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ రంగబాబు, ఉపసర్పంచ్ ఐవి.నరసింహారావు ఆధ్వర్యంలో విద్యార్థుల, తల్లిదండ్రుల ఆత్మీయ పోటీలు జరిగాయి.

**కూచిపూడి**: మొవ్వ జడ్పీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో-2 కె.శ్రీలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామసర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు, పాఠశాల హెచ్‌ఎం ఎస్.శ్రీదేవి, విద్యాకమిటీ చైర్మన్ గురువిందపల్లి బాబూరావు, పాల్గొన్నారు. చినముత్తేవి, కూచిపూడి, మొవ్వ, తదితర జడ్పీ పాఠశాలలతోపాటు 47 ఎంపీ ఎలిమెంటరీ, మూడు యూపీ పాఠశాలల్లో ఈ సమావేశాలు జరిగాయి.

**నందివాడ**: మెగా టీచర్స్ డే - పేరెంట్స్ కమిటీ సమావేశాలు శనివారం ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులచే విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందివాడ ఏపీసీడబ్ల్యూసీ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, రుద్రపాకలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ ఆప్కాబ్ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య (బాబ్జీ) పాల్గొన్నారు. పిల్లల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఈవో -2 డేవిడ్ రత్న రాజ్, చాట్రగడ్డ రవి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

**పమిడిముక్కల** : చోరగుడి జడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు జనసేన నాయకుడు నరేశ్‌తో కలిసి బహుమతులు అందచేశారు. తాడంకి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకుడు జక్కా గోవర్ధనరావు, ఎస్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు. గుర్రాల్లంక ఎంపీపీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పమిడిముక్కల సర్పంచ్ ముళ్లపూడి సునీత, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. హనుమంతపురం పాఠశాలలో ఎస్‌ఎంసీ చైర్మన్ రాజుల పాటి శివనాగరాజు, బాబూరావు పాల్గొన్నారు.


**మేడూరు (పమిడిముక్కల)**:మేడూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్ ఆత్మీయ సమావేశంలో నాటక పరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధి, మౌళిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

**పెదపారుపూడి**: మండలంలోని వెంట్రప్రగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరికిషోర్ అధ్యక్షతన మెగా పేరెంట్స్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి, మండల ప్రత్యేకాధికారి ఎన్.నరసింహులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంఈవో శ్రీనివాస్, ఆ పాఠశాల పూర్వ విద్యార్థి గొరిపర్తి రవికుమార్ పాల్గొన్నారు.

**గుడ్లవల్లేరు** : గుడ్లవల్లేరు మండలం కౌతవరం జిల్లా పరిషత్ హైస్కూల్ లో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడారు. తొలుత పాఠశాలలోని సరస్వతీ దేవి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన విజ్ఞాన ప్రదర్శనను ఆయన ఆసక్తిగా తిలకించారు. తల్లిదండ్రులతో, విద్యార్థులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం పద్మావతి, ఎస్‌ఎంసీ చైర్మన్ కె.ప్రకాష్, వైస్ చైర్మన్ సుధారాణి, ఎంపీటీసీ లక్ష్మి, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### విద్యతో పాటు క్రమశిక్షణ అలవరచుకోవాలి: ఎమ్మెల్యే వర్ల

**పామర్రు**: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం శనివారం మండల పరిధిలోని జమీగోల్వేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హాజరై మాట్లాడుతూ, జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడానికి విద్యతోపాటుగా క్రమశిక్షణ చిన్నతనం నుంచి అలవర్చుకోవాలన్నారు. జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ పాల్గొన్నారు. జుర్జువరం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణవాహిని ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంఈవో గుమ్మడి పద్మవాణి, ఎంపిపి దాసరిఅశోక్‌కుమార్ తదితర్లు పాల్గొన్నారు.




# నియోజకవర్గ అభివృద్ధికి నిధులు

## గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుడివాడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తున్నట్లు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం గుడివాడ రూరల్ మండలం గుంటా కోడూరులో నూతనంగా నిర్మితమైన రూ.10 లక్షల వ్యయంతో సీసీ రహదారులను ఎమ్మెల్యే, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుంటా కోడూరులో రోడ్లు, డ్రెయినేజీ తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేసే బాధ్యత తనదని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లటానికి కృషి చేస్తానన్నారు. రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గం టీడీపీకి కంచుకోటలాంటిదని, తిరిగి పూర్వవైభవంగా తెచ్చుకుందామని తెలిపారు. సర్పంచ్ అంగడాల భారతి, ఎంపీటీసీ అంగడాల రామాంజనేయులు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య (బాబ్జీ), జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్ర బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ, ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్, టీడీపీ నాయకులు అంగడాల వీర్రాజు, అంగడాల శ్రీను, పల్లెబాట రాజ, లోయ శివాజీ, అక్కల రామాంజనేయులు, బండి భూషణం, ఏఈలు వల్లభనేని సూరిబాబు, అట్లూరి వెంకటేశ్వరరావు, తదితర నాయకులు, గుంటా కోడూరు గ్రామస్థులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గుంటా కోడూరులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

### ధనుర్మాస మహోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

**గుడివాడ** : స్థానిక పాటిమీద ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకు జరగనున్న వార్షిక ధనుర్మాస మహోత్సవాల కరపత్రాలను శనివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వగృహంలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు, టీడీపీ నాయకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

### పరిసరాలను మనమే పరిశుభ్రపరచుకోవాలి

**గుడివాడ**: మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. శనివారం ఉదయం మీ కోసం మీ వెనిగండ్ల కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణపురం, బస్టాండ్ సెంటర్, మెయిన్‌రోడ్డులలో ద్విచక్రవాహనంపై పర్యటించారు. పలు ప్రాంతాల్లో సమస్యలకు కారణమవుతున్న వారిని ఎమ్మెల్యే వెనిగండ్ల హెచ్చరించారు. ఆయన వెంట టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి, టీడీపీ నాయకులు రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

## అదానీతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలి

### సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్

గుడివాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను నేటి కూటమి ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో అదానీ కుంభకోణంపై చర్చ పెట్టి, జాయింట్ యాక్షన్ కమిటీ వేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం కావాలనే సమావేశాలను వాయిదా వేస్తోందన్నారు. సౌర విద్యుత్ పేరుతో అదానీకు రాష్ట్రంలో వేల ఎకరాలను కట్టబెట్టారన్నారు. వాటిని వెంటనే కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పి.రజిని, రేపాని కొండ, రాంబాబు పాల్గొన్నారు.



### విద్యార్థినికి అభినందనలు

పెదపారుపూడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి ): జాతీయ స్థాయి ఖో- ఖో పోటీల్లో యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.అనిత అండర్-18 బాలికల విభాగంలో పాల్గొని ప్రశంసాపత్రం పొందినట్లు ప్రధానోపాధ్యాయురాలు వి.పద్మావతి తెలియజేశారు. సర్పంచ్ కె.అనూష, ఉపసర్పంచ్ సత్యనారాయణ, సుంకరపు రమేష్ బాబు, చెరుకూరి రమేష్, చెరుకూరి విజయ్ కుమార్‌లు శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు పి.ఎస్.సోమేశ్వరరావు విద్యార్థిని అభినందించారు.



ఆకతాయిలు తొలగించిన అరటి పిలకలు

### పేరెంట్స్ మీటింగ్ వేదిక అలంకరణ తొలగించిన ఆకతాయిలు

గుడ్లవల్లేరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అంగలూరు బాలుర హైస్కూల్‌లో గుర్తుతెలియని ఆకతాయిలు మెగా పేరెంట్స్ మీటింగ్ కోసం ఏర్పాటు చేసిన అలంకణను తొలగించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మెగా పేరెంట్స్ మీటింగ్ కోసం శుక్రవారం రాత్రి వేదికకు మామిడి తోరణాలు, అరటి పిలకలను అలంకరించారు. శనివారం ఉదయం పాఠశాలకు వచ్చి చూసేసరికి అన్నీ లాగి పడేసి, చిందరవందరగా ఉండటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు కంగుతిన్నారు. గ్రామస్తులు విషయం తెలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దీనికి బాధ్యులను గుర్తించి పోలీసులకు అప్పగించాలని ఉపాధ్యాయులకు గ్రామస్థులు సూచించారు.

# ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవం



గుడివాడ గౌరీశంకరపురంలో

గుడివాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గౌరీశంకరపురంలో ఉన్న శ్రీగౌరీశంకరస్వామి దేవస్థాన ఉపాలయమైన శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం శ్రీసుబ్రహ్మణ్యేశ్వర షష్టి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వామిని, అమ్మవార్లను పూలతో అలంకరించి అత్యంత వైభవంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు తెలిపారు.

**గుడివాడ రూరల్**: గుడివాడ రూరల్ మండలం పర్నాస గ్రామంలో ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీ విశాలాక్షి సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. దేవస్థానం నాగమోని చెరువు మధ్యలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు చేశారు. ఉదయం 4 గంటలకే భక్తులు స్వామికి పాలు పోసేందుకు తరలివెళ్లారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, పిన్నమనేని పూర్ణయ్య, మండల పార్టీ అధ్యక్షుడు వాసే మురళీ స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం స్వామికి తెప్పోత్సవ జరిగింది.

**నందివాడ**: రుద్రపాక శివారు గాజులపాడు, నందివాడలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నుంచి నాగేంద్ర స్వామికి పాలాభిషేకాలు, నవరత్నాలతో అభిషేకాలు చేశారు. నందివాడలో అడుసుమిల్లి కృష్ణమోహన్‌రావు ఆధ్వర్యంలో సుమారు 2500 మందికి అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీసీడబ్ల్యూసీ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**గుడ్లవల్లేరు**: కుచికాయిలపూడి గ్రామంలోని శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సామివారి కల్యాణ మహోత్సవంలో 26 మంది దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. భక్తులు పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించారు. వేడుకలు పొట్లూరి ఈశ్వరరావు, అన్నపూర్ణ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు.



కుచికాయలపూడి గ్రామంలో ..



నందివాడ అన్నసమారాధనలో రావి

### జాతీయస్థాయి ఉత్తమ విద్యాసంస్థగా వికాస్ రెయిన్‌బో

గుడివాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి ఉత్తమ విద్యాసంస్థగా వికాస్ రెయిన్‌బో పాఠశాల నిలిచింది. శుక్రవారం తెలంగాణ రాజధాని హైదరాబాద్ హైటెక్స్‌లో జరిగిన బ్రెయిన్ ఫీడ్ ఈటి టెక్ సంస్థ నిర్వహించిన ప్రత్యేక కాన్ఫరెన్స్‌లో ట్రైల్ బ్లేజర్ అవార్డును వికాస్ రెయిన్‌బో అధినేత పుట్టి రామచంద్రశేఖర్ అందుకున్నారు. శనివారం పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది అభినందించారు.

### శుభోదయ విద్యాసంస్థకు స్కూల్ ఎక్స్‌లెన్స్ అవార్డు

**గుడివాడ**: బ్రెయిన్ ఫీడ్ టెక్ ఎక్స్ హైదరాబాద్ సంస్థ నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో నందివాడ మండలం జొన్నపాడుకు చెందిన శుభోదయ ఇంగ్లీసు మీడియం పాఠశాల జాతీయస్థాయిలో ఉత్తమ విద్యాసంస్థగా స్కూల్ ఎక్స్‌లెన్స్ అవార్డును దక్కించుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సజ్జా అనీల్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు.

### సంపూర్ణ భగవద్గీత పారాయణం

**పామర్రు**: మండల పరిధిలోని నిమ్మకూరు శ్రీవేంకటే శ్వరస్వామి దేవస్థానంలో శనివారం తిరుమల తిరుపతి ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సంపూర్ణ భగద్గీత పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా విచ్చేసి తిరుమల తిరుపతి ధర్మాచారిణి స్వర్ణపతాక గ్రహిత జొన్నలగడ్డ మాధవి నేతృత్వంలో ఆలపించిన 700శ్లోకాలను కుమార్‌రాజా ఆలకించారు. తొలుత కూమార్‌రాజా టీటీడీ ధర్మప్రచార పరిషత్ సభ్యులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.